ప్రజాపక్ష సమీక్ష

మే 15-31, 2003 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | వెల రు. 5-00

లోపలి పేజీల్లో...

రెండురెళ్ళు నాలుగు..........	2
దేశీయం	3
వివాదం	5
మనలోనగం	7
భూభ్రమణం	9
భారత చిత్రం	11
అధ్యయనం	13
పునరుక్తి	19
పక్షం-పక్షం	22
ఆర్థికం	23

వార్షిక చందా రూ॥ 120/- లు

Edited, Printed and published by
V.Hanumantha Rao
for Samata Publications
D.No. 8-3-898/22, Road No.3,
Nagarjuna Nagar,
Hyderabad- 500 073.
Phone: 23748672

DTP: V.S.Graphics,
Erragadda. Ph:23837843.

Printed at: Charita Graphics
Chikkadpally, Hyderabad - 062.

సంపాదకీయం:

ఇది మహిళాసమాజానికి అవమానం కాదా?

గత పక్షంలో మహిళల గురించిన రెండు సందర్భాలకు సంబంధించిన వార్తలు వార్తా పత్రికల పతాక శీర్షికల్లో చోటుచేసుకున్నాయి. సమాజంలో సగభాగంగా ఉండి, 'ఆకాశంలో సగం' గా కీర్తించబడుతున్న మహిళలకు, రాజకీయ పరిపాలనా వ్యవహారాల్లో సముచిత స్థానం (33%) ఇవ్వదలచి! రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో ప్రతిమల్లా ప్రతిష్టించే ఆర్భాటపు ప్రయత్నం ఆశ్చర్యాన్ని కలిగించగా, హైదారాబాద్‌లోని ఆసుపత్రుల్లో సాక్షాత్తు తల్లితండ్రులే తమ పేగు బంధాన్ని తెంచుకు పుట్టిన ఆడబిడ్డల్ని మార్చి మగబిడ్డల్ని సంపాదించే 'పొత్తిళ్ళ' ప్రయత్నం సంచలనంతో కూడిన ఆందోళనను కలిగిస్తుంది. విడివిడిగా చూస్తే దేనికదేగా కనిపిస్తున్న ఈ రెండు సందర్భాలు కలిపి చూస్తే మాత్రం ఒకే విషయానికి సంబంధించిన వైరుధ్యాలే. రెండు సందర్భాల్లోనూ మహిళా జాతికి జరుగుతున్నది అమానుషమైన అవమానమే. ఒకటి 'పురిట్లో' జరుగుతుంటే, మరొకటి అత్యున్నత చట్టసభల్లో జరుగుతున్నది. ఇప్పటి ప్రస్థావన బిడ్డల స్థాన మార్పును గూర్చి.

ఒక సమాజపు ఆరోగ్య నడతపై ప్రభావం చూపించే ఈ సందర్భంపై సాధారణ ప్రజలు మొదలు ఒకమోస్తరు బుద్ధిజీవుల వరకు చేస్తున్న విమర్శంతా సిబ్బంది అధికారుల అవినీతికోణం లోనే తప్ప, సమాజపు పునాదిలో మహిళలపై జరుగుతున్న అవమానకర వివక్షపై ప్రశ్నలే లేకపోవడం ప్రమాదకర విషయం. (ఆమాటకొస్తే ఒక సంప్రదాయంగా మహిళల్ని చట్టసభలో ప్రతిమలుగా మార్చబోతున్న 'రిజర్వేషన్' చట్టంపైనా విమర్శలేదు). ఈ నిర్లిప్త, నిరాసక్త ధోరణి పాలకవర్గాలకు ప్రజల మౌళిక సమస్యల పరిష్కార బాధ్యత నుండి తప్పుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఆ క్రమంలో అవి పరిష్కారాన్ని ఉపరితలంలో చూపించే తలక్రిందుల ప్రయత్నాన్ని చేస్తుంటాయి. ఈ విషయంలోనూ అదే జరుగుతుంది. బిడ్డల మార్పిడిలో సహకరించిన సిబ్బందిని కఠినంగా శిక్షిస్తాం', అని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ఈ కోవలోకే చెందుతుంది. అయితే ఈ విషయంలో సిబ్బంది అవినీతిని ప్రశ్నించకూడదని ఎవరూ అనడం లేదు. కాని సిబ్బందిని శిక్షించినంత మాత్రాన ఈ సంఘటనల పునరావృతానికి ఫుల్‌స్టాఫ్ పడుతుందా? అన్నది ప్రశ్న. అంతకంటే ముందు కన్నవాళ్లే ఆడబిడ్డల్ని వద్దని వదిలేయడం, లేదా ఆ బిడ్డల స్థానాన్ని పొత్తిళ్లల్లోనే మార్చేయడం ద్వారా మగబిడ్డల్ని పొందాలనే అసహజ, అసాధారణ ఆలోచనకు ఎందుకొస్తున్నారనే ప్రశ్నకు జవాబు వెతకాల్సి ఉంది.

సహజమైన ప్రతీ విషయం అసహజమైపోతున్న ఈ అసమ సమాజంలో పిల్లల పెంపకంపై తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి సైతం అసహజమైన 'లాభనష్టాల'ను బేరీజు వేసే స్వభావంతోనే కొనసాగుతుంది. ఆడపిల్లలను పెంచి, పెద్ద చేసి, పెళ్లి చేయడం అన్నది ఖర్చుతో కూడుకున్న 'నష్టం' వ్యవహారమని, మగపిల్లల విషయంలో చేసే ఖర్చు అనేకరెట్లుగా వరకట్నం రూపంలో తిరిగొచ్చే 'లాభదాయక' వ్యవహారంగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీనికి తోడు కుటుంబ గౌరవ మర్యాదలు, కీర్తి ప్రతిష్ఠల పెంపు మగవాళ్ల ద్వారా మాత్రమే ఇనుమడింపబడే విషయాలుగా మారిపోయాయి. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యతను పురుషుని భుజాల కెత్తడం ద్వారాను, చస్తే తలకొరివి పెట్టే కార్యాన్ని తలకెక్కించుకునే మూడాచార సంస్కృతీ సంప్రదాయ కార్యక్రమాలను ఆసరా చేసుకుని పురుషుడు మహిళల మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. దీనంతటికి కారణం స్త్రీని బానిసగా, పురుషున్ని యజమానిగా నిలిపి ఉంచే అసమస్థితికి కారణమైన శ్రమ విభజన స్త్రీ పురుషుల మధ్య కొనసాగడమే ఈ సమస్యల అంతటి కలగలిసిన ఆలోచనా ధోరణి ఫలితమే తల్లితండ్రులకు సైతం ఆడపిల్లలమీద కాంక్షలు, ఆకాంక్షలు లేకపోవడానికి, ఉన్నా తగ్గిపోవడానికి కారణం.

ఇలా అసమ సమాజపు కనపడని పునాది నిర్మాణ కారణాలను పట్టుకొని పరిష్కరించనంతకాలం మహిళా లోకానికి ఈ అనాగరికపు, అసహజ, అవమానకర సందర్భాలు తప్పవు.

ప్రధాన ద్రవ్య సూచికలు - పెరుగుదల రేట్లు (అన్ని రాష్ట్రాలు)

(మొత్తం కో. రూ. రేటుశాతం)

సంవత్సరం	రెవెన్యూ ఆదాయం	రెవెన్యూ ఖర్చు	పెట్టుబడుల ఆదాయం	పెట్టుబడుల పద్దు కింద ఖర్చు	వడ్డీ చెల్లింపులు
1	2	3	4	5	6
1997-98	170300	186634	59934	41501	30113
1998-99	176448	220090	86393	46271	35871
1999-2000	207201	260998	103575	52891	45172
2000-01	237953	289268	111591	55670	51576
2001-02	270885	331440	123532	70131	64502
2002-03	306932	335166	118812	75768	72285
సంవత్సర సగటు అభివృద్ధి శాతం (1997-98 నుండి 2002-03)	12.30	15.44	19.82	14.02	20.98

రాష్ట్రాల వడ్డీ భారం

సంవత్సరం	మొత్తం రుణాలమీద వడ్డీ	వడ్డీ చెల్లింపుల శాతం		
		రెవెన్యూ ఖర్చులో	రెవెన్యూ ఆదాయంలో	స్థూల జాతీయాదాయం
1	2	3	4	5
1990-91	8.655	9.52	13.02	1.52
1995-96	21.933	12.35	16.03	1.85
1998-99	35.874	13.45	20.33	2.06
1999-2000	45.526	14.26	21.97	2.36
2000-01	51.576	17.83	21.67	2.47
2001-02	64.502	16.46	23.81	2.79

త్రిశూల దీక్షలు - మతరాజకీయాలు

- వకుళాభరణం రామకృష్ణ

దేశంలో రాజకీయాలతోపాటు రాజకీయ పక్షాల తీరుతెన్నులు, అవి అవలంభించే ఎత్తుగడలు, వ్యూహాలు వేగంగా మారుతున్నాయి. కొత్త రూపాలను దాల్చుతున్నాయి. రాజకీయాల్లో ఈ మార్పు విడ్డూరమేమీకాదు. కాకుంటే రాజకీయాలు ఎంత భ్రష్టమైనవని అనేకులు భావించినా, వాటికీ కొన్ని కనీస నీతి, నియమాలుంటాయనీ, అవి పాటించాల్సిన అవసరముందని భావించడం సహజం. నీతి బాహ్య రాజకీయాల తీరుతెన్నులు గత కొన్నేళ్ళుగా మనం గమనిస్తూనే ఉన్నాం. ప్రజలను మభ్యపెట్టే రీతిలో విపరీతమైన వాగ్దానాల వర్షాలు కురిపిస్తూ, అసత్యాలపై అసత్యాలు వల్లిస్తూ, ప్రత్యర్థులపై బురద జల్లుతూ, అతి హేయమైన స్థితికి రాజకీయాల స్థాయి దిగజారింది. విశ్వసనీయత కోల్పోయి ఎవర్నీ నమ్మలేని స్థితికి సామాన్య పౌరుడు సంక్షోభంలో పడ్డాడు.

రాజకీయాల్లో నీతిని గురించి ప్రస్తుతానికి మనం మాట్లాడటం మానేద్దాం. ఇప్పుడు మనముందున్న ఒక ముఖ్య సమస్య, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందడం, కొన్నేళ్ళుగా మనం గమనిస్తూ వస్తున్నాం. నిర్మాణయుతమైన, ప్రజాహితమైన కార్యక్రమాలు చేపట్టక, రాజకీయంగా అట్టడుగు స్థాయిన వున్న కొన్ని రాజకీయ పక్షాలు మతాన్ని, దేవుళ్ళను మార్కెట్ సరకుగా మార్చి. 'పవిత్రమైన' వాటిని బజారుకు ఈడ్చి, రాజకీయాల్లోకి చొప్పించి, అధికార పీఠాలను ఆక్రమించుకున్న వైనం మనం చూశాం. ఇప్పుడు సంఘ పరివార శక్తులు మరో కొత్త ఆయుధాల్ని రాజకీయ బరిలోకి దించారు. దానిపేరు త్రిశూలం. పదునైన మొనలతో కూడిన ఈ ఆయుధాన్ని (ఇప్పుడు ఈ ఆయుధాన్ని ఆరంగుళాల సైజుకు కుదించారట!) విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో దీక్షా సదస్సులు నిర్వహించి వేలాది మందికి ఉచితంగా పంచడం లేదా చాలా తక్కువ ధరకు అమ్మడం జరుగుతోంది. భజరంగ్ దళ్ మాజీనేత, విశ్వహిందూ పరిషత్ నాయకులలో ఒకరు సురేంద్రజైన్ మాట్లాడుతూ, దేశం నాలుగు చెరగుల్లో రెండు లక్షల త్రిశూల దీక్షా సదస్సులను నిర్వహిస్తామన్నాడు.

త్రిశూలం సామాన్య పరిజ్ఞానంలో ఒక ఆయుధం. ఆయుధం, మహాకవి శ్రీశ్రీ అన్నట్లు "ఆశయాలు సంఘర్షించేవేళ ఆయుధం నిష్పక్షపాతం కాదు" అన్నట్లు అది ఖచ్చితంగా ఒక పక్షాన నిలుస్తుంది. విశ్వ హిందూ పరిషత్తు నాయకులు త్రిశూలానికి మత తత్వాన్ని పులిమారు. దానికొక పవిత్రత ఆపాదించారు. త్రిశూల దీక్షా సదస్సులను మతపరమైన కార్యక్రమాలుగా అభివర్ణించారు. ఇక్కడ మనం ఆలోచించాల్సింది, ఇందులో పవిత్రత లేక మత తత్పరత నిజంగా ఉందా? ఉంటే మెజారిటీ మతానికి చెందిన మత చిహ్నంగా దాన్ని భావించినా, ఆ చిహ్నాన్ని భారీ ఎత్తున ప్రజల్లో మతం పేరుతో విస్తారంగా పంచడం వల్ల భారతీయ సమాజాన్ని మత పరంగా నిట్ట నిలువుగా చీల్చడమే కదా? మత ఛాందసత్వాన్ని పెంపొందించడమే కదా! మైనారిటీల పట్ల శతృభావాన్ని ప్రజల్లో ప్రోది చేయడమే కదా! ఒకవేళ మత చిహ్నాలనే సమాజంలో వాడదల్చుకుంటే లేక పంచ దల్చుకుంటే హిందూ మతానికి చెందిన అనేక ఇతర మత చిహ్నాలు ఉన్నాయి. గ్రంథాలు ఉన్నాయి. లేదా, మతం పేరుతో, ధార్మికత పేరుతో ప్రజలకు కావల్సిన కూడు, గుడ్డ, నీరు, కొంప, చదువు, సంధ్య, మందు, మాకు ఇలా ఎన్నో సత్కార్యాలను చేపట్టే అవకాశాలు బోలెడున్నాయి. వాటన్నింటిని వదలి, ప్రజలకు ఏ విధంగానూ ఉపయోగపడని ఈ త్రిశూలాల పంపిణీ ఎందుకు చేస్తున్నట్లు?

సంఘ పరివార్‌లో అత్యంత ప్రాముఖ్యం వహించే వి.హెచ్.పి. గుజరాత్ మారణకాండలో జరిపిన నిర్వాకం మనం ఇంకా మరచిపోలేదు. గోధ్రా మారణహోమాన్ని సాకుగా చేసుకొని, ముఖ్యంగా విహెచ్‌పి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు మత విద్వేషాన్ని రెచ్చగొట్టి, ఒక పకడ్బందీ ప్రణాళిక ప్రకారం మైనారిటీ ప్రజల ఆస్తి, మాన, ప్రాణాలను వేలాది సంఖ్యలో బలిగొని, భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని, రక్తసిక్తం చేశారు. ఇది కేవలం మతంకోసం, మాత్రమే చేసింది కాదు. అలా చేస్తే అది మత ఛాందసత్వంగానీ, మత దురహంకారం గానీ అవుతుంది. కానీ, అలా చేయడం ద్వారా సమాజాన్ని మత ప్రాతిపదికపై రెండుగా చీల్చి, మెజారిటీ ప్రజల మనోభావాన్ని మతం పేరుతో ఆకట్టుకుని, ఆ తరువాత జరిగిన

ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాన్ని పొందగలిగారు.

సంఘ పరివార శక్తుల ప్రధాన సైద్ధాంతిక వేదిక హిందూత్వ భావజాలం. దీన్నే వాళ్ళు సాంస్కృతి జాతీయవాదంగా చెప్పుకుంటున్నారు. జాతీయవాదాన్ని ఒక ఆధునిక రాజకీయ భావజాలంగా పరగణించి, నిర్వచించి, దాన్ని విశ్లేషించి, వివరించిన రాజనీతి తత్త్వవేత్త లెవరూ వీరి నిర్వచనాన్ని ఆమోదించరు. మతానికి, జాతీయతకు ముడిపెట్టి, మతాధారంగా, ప్రత్యేకించి, ఒక మెజారిటేరియన్ మత భావజాలానికి అనుగుణంగా భారత జాతీయతను వివరించడంలో వీరి ఉద్దేశ్యం భారతదేశాన్ని ఒకే ఒక అఖండ సంస్కృతిగా చూడ్డమే. ఇలా చూడ్డం చారిత్రక వాస్తవాలకు విరుద్ధమని, ఏమాత్రం చారిత్రక స్పృహ ఉన్నవారికైనా అర్థం అవుతుంది. భిన్న మతాలు, భిన్న తాత్త్విక అవగాహనలు, భిన్న సంస్కృతులు కలగలిసిన సంపన్నమైన సంకీర్ణ సంస్కృతి మనది. పైగా వీరు చెబుతున్న హిందూత్వకూ, అసలు హిందూ మతానికీ సంబంధమే లేదు. హిందూ మతాన్ని చాలామంది విజ్ఞులు, తాత్త్వికులు ఒక మతంగా అంగీకరించరు. ఒకవేళ అంగీకరించినా, అతి సంకుచితమైన రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించిన హిందూత్వకు, హిందూ మతానికీ పొంతనేలేదు. సాంప్రదాయికంగా, ప్రజలు విశ్వసించి, విశాలార్థంలో పాటిస్తూ వస్తున్న హిందూ మతానికి, వీరు ప్రచారం చేస్తున్న హిందూత్వకు సంబంధమే లేదు. ఇక్కడే మరో అంశాన్ని కూడ ప్రస్తావించుకోవాలి. కేవలం హిందుత్వ భావజాలంతో తమ రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవచ్చు నన్న నమ్మకం పరివార్ శక్తులకున్నట్టు లేదు. గుజరాత్‌లో సృష్టించిన మత విద్వేషాగ్నులను, ఏదో ఒక రూపంలో రగిలించి, సామాజిక సామరస్యాన్ని రూపుమాపి, హింసను, భయోత్పాతాన్ని సృష్టించి, తద్వారా మెజారిటీ ప్రజల మనోభావాల్ని ఆకట్టుకోడం ద్వారా ఎన్నికల్లో విజయం సాధించవచ్చునన్నది వీరి వ్యూహం.

త్వరలో ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇవి ఆ తర్వాత జరగనున్న పార్లమెంటు ఎన్నికలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. వీటిల్లో గెలవడానికి అన్ని రాజకీయ పక్షాలు తమ, తమ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకొంటున్నాయి. వీటిలో, సహజంగా ప్రభుత్వ పని తీరు, పరిపాలనా సామర్థ్యం, ప్రజల అవసరాలు, వారి బాగోగులు, నిరుద్యోగం వల్ల యువతలో వ్యాపిస్తున్న నిరాశా నిస్పృహలు, సమాజంలో తామరతంపరలా విస్తరించిన అవినీతి లాంటి అంశాలు చర్చకు రావాలి. ఈ సమస్యలపై రాజకీయ పక్షాల వైఖరులు స్పష్టం కావాలి. కానీ, యీ సమస్య లేవీ ముగ్గులోకి రావడం లేదు. లాఠీ, కత్తి, గొడ్డలి, 'ప్రసాదం', భోజశాల, మత మార్పిడులు - ఇవి చర్చనీయాంశాలయ్యాయి. ఒక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి (వాస్తవానికి యిప్పుడూ అదే పదవిలో వున్నట్టే లెక్క) విస్తారంగా, తన పార్టీ అనుచరులకు పాట్నాలో ఒక 'మహాలాఠీర్యాలీ' నిర్వహించి లాఠీలను పంచి పెట్టాడు. అలా పంచడం 'ఆత్మరక్షణ' కోసమని బుకాయించినా, అందులోని ఆంతర్యం తెలుస్తూనే వుంది. (స్వయం సేవకులకు లాఠీ తప్పని సరిగా వుంటుంది. శాఖల్లో వారికి కర్ర శిక్షణ యివ్వడం పరిపాటే). మరో కులానికి చెందిన పేరున్న ఒక నాయకుడు, ఉత్తర ప్రదేశ్‌లో, తనకుల శౌర్య ప్రతాపాలకు చిహ్నంగా కత్తిని పేర్కొని, అనుచరులతో కలిసి బాహాటంగా కత్తి ప్రదర్శన జరిపాడు. ఇక పరుశురాముడి చిహ్నం గొడ్డలితో ఆయన కులానికి చెందిన వారు ఒక ప్రదర్శన రాజస్థాన్‌లో నిర్వహించారు. రాబోయే రోజుల్లో, స్థల పురాణాలను తవ్వితీసి, ప్రతి కులానికి చెందిన ప్రజలు, గతంలో, వారి ఆయుధమేదో పరిశోధించి తెలుసుకొని, దాంతో బహిరంగ విన్యాసాలు జరిపినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

మతం, కులం ఆధారంగా విద్వేషాలను రెచ్చగొట్టడమే కాకుండా, ఆయుధాలతో వాటిని వేంళవించి, వబ్బం గడుపుకోవాలన్న మనస్తత్వం నిజంగా మధ్యయుగాలకు చెందిన సంస్కృతీ సంప్రదాయం. ఆధునిక యుగంలో, ప్రజాస్వామ్య, లౌకిక విలువల ప్రాతిపదికగా, సమత, మానవతలతో వర్ధిల్లే సమాజాన్ని ఆశిస్తూ, దాన్ని నిర్మించే దశలో నడవాల్సిన నేడు, మనం చరిత్రలో వెనక్కి, యింకా మరీ వెనక్కి, ఆటవిక దశకు వెళ్తున్నామనిపిస్తుంది. త్రిశూల దీక్ష, లేదా కత్తుల ప్రదర్శన, లేక గొడ్డళ్ళ వూరేగింపు యీ కోవలోకే వస్తాయి. త్రిశూల దీక్షా కార్యక్రమాల్ని నిషేధిస్తూ, రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న చర్య, చట్టరీత్యా సరియైనదే. ఇలాంటి సందర్భాల్లో చట్టబద్ధ పరిపాలనే మనకు శరణ్యం కావాలి. రూల్ ఆఫ్ ది లాను, మతం, సంప్రదాయం పేరుతో ధిక్కరించి, వాటర్ సినిమా యూనిట్‌ను, హుస్సేన్ చిత్రాలను ధ్వంసం చేయడం, సరైన చర్యలు కావు. ఈ ధోరణులు క్రమేపీ ఫాసిజానికి దారితీస్తాయి. ఇప్పుడు జరుగుతున్నదదే, ఇందులో ఉపేక్షించడానికి ఏమాత్రమూ వీల్లేదు. కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో, యీ అంశాలపై ఆయా ముఖ్యమంత్రులు అనుసరింప చూస్తున్న విధానాలు మరోవైపు సాఫ్ట్ హిందూత్వాకు దారితీసేట్టుగా వున్నాయి. ఈ సాఫ్ట్ హిందూత్వని

(మిగతాది 18వ పేజీలో)

ప్రజల మనుషులు-పత్రికల మధ్య ప్రయివసీ సమరాలు

- మాడభూషి శ్రీధర్

చిరంజీవి కూతురు వివాహ నిశ్చితార్థం సందర్భంగా ఫొటోలు తీయబోయిన పత్రికా ఫొటోగ్రాఫర్లను కొట్టినందుకు పవన్ కల్యాణ్ అనే హీరో పైన క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆ తరువాత జరిగిన అనేక సంఘటనలు ప్రైవసీ పైన చర్చకు మంచి అవకాశాన్ని కలిగిస్తున్నాయి. ఎవరు కరెక్ట్ ఎవరు కాదు అనే వివాదం కాకుండా, ఏది ప్రయివసీ ఎవరిది ప్రైవసీ అనే అంశాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది.

వ్యక్తిగత వివరాల జోలికి పోగూడదన్నది జర్నలిస్టులు పాటించవలసిన ఒక ప్రధానమైన నైతిక సూత్రం. వ్యక్తిగతానికి ప్రైవసీ అని చట్టపరమయిన గుర్తింపు కూడా ఉంది. అనేక రకాల మానవ హక్కులలో ఎవరి గుట్టు వారు కాపాడుకునే హక్కు ఒకటి. జీవించే స్వేచ్ఛలో ప్రైవసీ ఒక భాగమని సుప్రీం కోర్టు కూడా అనేక సందర్భాలలో వివరించింది. పత్రికా స్వేచ్ఛ అందరికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమన్న విషయం తెలిసిందే. అయితే ఈ హక్కును వినియోగించుకునే తొందరలో ఇంటిగుట్టు బయటపడకుండా జీవించే హక్కును భంగపరచకూడదు. ఒక హక్కు మరో హక్కు మీద పరిమితి అవుతుంది. ఒక వ్యక్తి హక్కు మరో వ్యక్తి హక్కుకు భంగకరంగా వినియోగించుకోవడానికి వీల్లేదు.

సెలెబ్రిటీలకు దురదృష్టవశాత్తూ ప్రయివసీ లభించదు. అది వారి వృత్తిపరమనయిన ఇబ్బంది. అయినా వారికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. అది వారి ప్రజాజీవన రంగపు చాయలకు దూరంగా ఉండాలనుకోవడం మంచిదే. కాని ఉండదు. సినీనటుడి వ్యక్తిగత జీవితం గురించి చర్చించుకోకుండా ఉండడం సాధ్యం కాదు. సినీ నటులు ప్రజలు కేవలం టిక్కెట్టుకొని సినిమాచూసి మరిచిపోకుండా ఉండాలని తమను అభిమానించాలని కోరుకుంటారు. తమకు పబ్లిసిటీ విపరీతంగా ఉంటేనే మార్కెట్‌లో ఉంటామని అనుకుంటూ ఉంటారు. అవసరం వచ్చినా రాకపోయినా తమ వ్యక్తిగత జీవిత విశేషాలు సభల్లో సత్కారాల్లో, పత్రికల్లో టీవి ఇంటర్వ్యూలలో చెప్పుకుపోతుంటారు. వారికి నచ్చని విషయం ఏదయినా వచ్చేసరికి ప్రయివసీ భంగపడిందని బాధపడుతుంటారు. అప్పుడుప్పుడు ఉడుకు రక్తం హీరోల వలె విలేకరులను కొడుతూ ఉంటారు. అది వారి అజ్ఞానానికి, అపరిపక్వతకు నిదర్శనంగా మిగిలిపోతూ ఉంటుంది.

సినీనటుడు మరో నటితో మితిమీరి స్నేహం చేస్తే వారిమధ్య సంబంధాలను కూడా మితి మీరి ఊహించే పరిస్థితి దాని గురించి పత్రికల్లో రాసే పరిస్థితి వస్తుంది. అది వారు అర్థం చేసుకోవలసి వస్తుంది. ఎంత సామాన్యుడయినా సరే పక్కవారిని దెబ్బతీస్తే అతనిపైన కేసు పెట్టవలసి ఉంటుంది. దానిగురించి పత్రికలు రాస్తాయి. తప్పదు. నేరానికి పాల్పడిన తరువాత సామాన్యుడు కూడా ప్రయివసీ కోల్పోతాడు. రాజకీయ నాయకులు కూడా అంతే. మంత్రి పదవుల్లో వున్న వ్యక్తులు లేదా ఎంఎల్యేలు రెండో పెళ్ళి చేసుకుంటే అది వ్యక్తిగత విషయం అనిపించుకోదు.

> 'మా వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశించవద్దు' అంటూ ఇటీవల కొందరు సినిమా నటులు జర్నలిస్టులను హెచ్చరించారు. వారి వ్యక్తిగత జీవితాలా భద్రంగా ఉండాలి. కాని అసభ్య సంభాషణలు, అశ్లీల సన్నివేశాలతో వారు మీడియా ద్వారా కోట్లాది ప్రేక్షకుల వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశించవచ్చా? గురు శిష్యుల సంబంధాలను సైతం జుగుప్సాకరంగా చిత్రీకరించి విలువలను పీకలలోతు గోతుల్లో పూడ్చి పెట్టవచ్చా? ఎవరి వ్యక్తిగత జీవితాల్లోకి ఎవరు ప్రవేశిస్తున్నట్లు? సినిమా హీరోల కోసం రోడ్డు ఎక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న నేటి యువతరం భగత్‌సింగ్, అల్లూరి, అష్ఫాకుల్లాఖాన్ వంటి యువ కిశోరాలు దేశం కోసం ఎలా ప్రాణత్యాగం చేశారో తెలుసుకోవాలి. వారిని ఆదర్శంగా తీసుకోవాలి. అంతే కాని సమాజ నిర్మాణంలో తమ పాత్ర మరచి సినిమా హీరోలనే దైవాలుగా ఆరాధిస్తూ కాలాన్ని వృథా చేసుకోవడం తగదు. సినీ రంగంలో తమ ఎదుగుదలకు సినీ తారలు తమ అభిమానులను కేవలం పావులుగా వాడుకుంటారే తప్ప, అభిమానులకు మాత్రం ఒరిగేదేమీ ఉండదు.
>
> - కొప్పల భానుమూర్తి,
> శ్రీకాకుళం
> (వార్త సౌజన్యంతో)

మొదటి భార్యకు విడాకులిచ్చి అది నా ప్రయివేటు వ్యవహారం అంటే కుదరదు. అక్రమ సంబంధాల విషయంలో కూడా ప్రయివసీ అని తప్పించుకోవడానికి వీల్లేదు. ప్రజా ప్రతినిధులు, ప్రజాభిమానాన్ని ఆశించే నటులు నీతి వంతులుగా ఉండాలని జనం కోరుకుంటారు. అలాంటి వారి విషయాలను దాచబడకూడదని ప్రజలు ఆశిస్తుంటారు. రెంటి మధ్య పత్రికలు తమ విధులు నిర్వహించవలసి ఉంటుంది. పవన్ కల్యాణ్ దౌర్జన్యం వంటి సంఘటనలు ఎదుర్కోవటం విలేకరులకు వృత్తిపరంగా తప్పని తలనొప్పి.

బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యావంతులయిన ప్రజలున్న సమాజాల్లో మంత్రులు వారి మధ్య తిరిగినా, నటులు వచ్చినా పెద్దగా పట్టించుకోరు. క్రేజ్ అసలు ఉండదు. కాని మన 'ప్రజలమనుషులకు' ఆ విధంగా ఉంటే ఇష్టం ఉండదు. తాము ఎక్కడికి పోయినా జనం చుట్టూ మూగాలి. ఆటోగ్రాఫ్‌లు అడగాలి. అప్పుడు గాని వారికి తృప్తి ఉండదు. కాని తమకు సంబంధించిన అన్ని విషయాలూ చర్చకు రాగూడదు. ఇమేజ్ తగ్గించే వ్యవహారాలు చేసినా వాటిగురించి జనం చెప్పుకోగూడదు. పత్రికలు రాయకూడదు. అప్పుడు ప్రయివసీ గుర్తుకు వస్తుంది. ఇటువంటి వివాదాలు హక్కుల వివాదాలు కాదు. వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు సంబంధించిన వేశాలే గాని మరోటికాదు.

అమితాబ్ బచ్చన్ షూటింగ్‌లో గాయపడితే కోట్లాది ప్రజలు ఆయన కోలుకోవాలని ప్రార్థనలు చేసారు. 'ఆరోగ్యం నా ప్రయివేట్ వ్యవహారం మీకెందుకు శ్రమ' అని ఆయన అనలేదు. ఆ అభిమానం చూసిపులకించిపోయారు. సహజమే. కాని 'సిల్సిలా' అనే సినిమాను ఆయన ప్రేమ ట్రయాంగిల్ ఆధారంగా తీసిన సినిమా అని పత్రికలు రాస్తే మాత్రం కోపం వచ్చింది. తను జయాబచ్చన్ రేఖ మధ్య జరిగిన నిజజీవన కథనమే సినిమా అయిందనడం తప్పు. ఆ విధంగా వ్యవహరించడం మాత్రం ప్రయివేట్ వ్యవహారం.

ఫలానా కూల్‌డ్రింకే తాగమని నటులు డబ్బు తీసుకుని జనాలకు చెప్తూ ఉంటారు. ఈ విషయం చెప్పడానికి సకుటుంబంగా తెరమీద కనిపిస్తారు. తనే కాదు తమకుటుంబమంతా అదే డ్రింకు సేవిస్తామని చెప్తారు. అప్పుడు ప్రయివసీ అడ్డురాదు. వారి ప్రకటనల యుద్ధంలో అన్నాదమ్ముల పోటాపోటీ ప్రస్తావన కూడా వస్తుంది. అయినా జనం భరించాలి. 'మీ సినిమా నటనను ఆదరిస్తున్నాం కనుక మీరు డబ్బు తీసుకుని ఫలానా వస్తువు కొనమని ప్రచారం చేస్తుంటే మేం కొనాలా అని ఎవరూ అడగరు. కనుక సరిపోతుంది.

చిరంజీవి కూతురుని మరో సినిమా నటుడికి ఇచ్చి వివాహం చేయడం ప్రయివేటు వ్యవహారం కాదు. అసలెవరి వివాహమయినా ప్రయివేట్ వ్యవహారం కాదు. సమాజానికి ఈ జంట నవదంపతులని వారు సహజీవనం సాగిస్తారని వివరించే ప్రకటనోత్సవం వివాహం. అదీగాక ఆ విషయం ఈ మహానటులే పత్రికలకు వివరించారు. తమ ప్రయివసీని తామే వదులుకుని ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ అమ్మాయి ఫోటోలు కూడా వేసారు. 'అప్పుడే నేను మామగారినయ్యానా అనిపించింది' అని చిరంజీవి వ్యక్తిగత మనోభావాలతో కూడిన ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నాకు ఎంతో సంతోషంగా ఉంది' అని ఉదయ్‌కిరణ్ మరోపత్రికకు చెప్పుకున్నారు. నిజానికి వీరిద్దరూ కలిసి ఆ అమ్మాయి ప్రయివసీని భంగపరిచారనవచ్చు. నిశ్చితార్థానికి కొందరిని పిలిచారు. కొందరిని పిలువలేదు. అభిమానులు వచ్చారు. అభిమానుల సంఘాల వారు జయజయధ్వానాలతో నిరంతరం కీర్తిస్తుంటే వళ్లు మరచి పోయి పరవశించడం తారలకు అలవాటు. కనుక వారు ఉండాలి. జనం కూడా పిచ్చిగా సూపర్‌స్టార్ మెగాస్టార్ అంటూ వారింటి వివాహం గురించి వివరాలు ఆశిస్తూ ఉంటారు. ఆ వార్తలు మోయడానికి విలేకరులను, ఫోటోగ్రాఫర్లను పత్రికల వారు టివిల వారూ పంపుతూ ఉంటారు. మీకు ఇన్విటేషన్ ఉందా అంటే ఏం చెపుతారు? ఈ ప్రజాతారలు కొందరినే పిలిచి మరికొందరిని వదిలేస్తే వారేం చేస్తారు? ఇది ప్రయివసీ ఉల్లంఘన అంటే అంతకన్న హాస్యాస్పదమయిన మాట మరొకటి ఉండదు.

క్రిమినల్ కేసుల్లో నిందుతులయి అరెస్టయిన వ్యక్తుల ఫోటోలను తీయడానికి పత్రికా ఫోటోగ్రాఫర్లు నానాతంటాలు పడుతూ ఉంటారు. ఆ నిందితులు ప్రెస్‌వారు లేని దారిలో పారిపోతూ ఉంటారు. అయినా పట్టుకుని కెమెరా ఎక్కుపెడితే, వారు ముఖాలు చాటు చేసుకుంటారు. వీరికి ఫోటో తీసే హక్కు ఉందా అన్నది ఒక ప్రశ్న అయితే, వారికి ముఖాలకు ముసుగు వేసుకునే హక్కు ఉందా అనేది మరో ప్రశ్న. రెండిటికీ జవాబు ఉందనే. ఒక క్రిమినల్ కేసులో నిందితుడు కనుక ప్రయివసీ లేదనడం ప్రెస్‌కు చెల్లింది. కాని ఇంకా నేరం రుజువు కాలేదు, నేను అమాయకుడిని కనుక నా ముఖం దాచుకుంటా అని అతనూ అనవచ్చు. ఇది నిత్యసంఘర్షణ. జరుగుతూనే ఉంటుంది.

(మిగతాది 10వ పేజీలో)

మౌలిక సమస్యలను పరిష్కరించకుండా చట్టసభలకు రిజర్వేషన్ మహిళలకు ప్రయోజనమేనా?

- ఇ.పి.ఎస్.పి.దర్శిని

'చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల' బిల్లు పార్లమెంటులో ప్రస్థావించబడుతున్న ప్రతీసారీ ప్రభుత్వానికి. కొన్ని ప్రతిపక్షాలకు మధ్య కొనసాగుతున్న వివాదం (నిజానికి అందులో ఎవరికీ ఏం వివాదం లేదు. అంతాపైకి మాత్రమే) చూస్తుంటే చాలా తమాషాగా అనిపిస్తుంది. పార్లమెంటులో బిల్లు చర్చకైనా రాకుండానే వాయిదాపడడం వెనుక గల రాజకీయ మౌలిక లక్షం ఇరువురిది ఒకటే అయినా పైకి మాత్రం తమ తమ వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయంగా ప్రదర్శిస్తుండడమే అసలు రహస్యం. చట్ట సభల్లో మహిళలకు కేటాయించే రిజర్వేషన్లకు కులప్రాతిపదిక పునాది ఉండాలనే ప్రతిపక్ష పార్టీల్లోని కొన్ని పార్టీలు ఏడేళ్లుగా పట్టువిడువకుండా ప్రతిపాదన చేస్తున్నాయి. అయినాసరే వాటిని పరిశీలించి, చర్చించి సవరణలు తీసుకురావడానికి ప్రభుత్వం ససేమిరా ఒప్పుకోనంటూ 'పాడిందే పాడరా పాసిపండ్ల దాసరి' ధోరణిలో పార్లమెంటులో ఈ బిల్లును యధాతదంగా ప్రతిసారీ ప్రవేశపెడుతూనే ఉంది. కొన్ని ప్రతిపక్షాలు షరామామూలుగా వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఫలితంగా బిల్లు చర్చకు రాకుండానే వాయిదాపడుతుంది. నాలాంటి ఏదో కొద్దిమందికి ఈ బిల్లు వాయిదాపడడంపై ఆశ్చర్యం ఏమిలేదుగాని, 'మహిళలు ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిషార లక్ష్యం బిల్లు చట్టరూపం దాల్చపోవడంతో దెబ్బతింటుందనే ఆందోళనా భావం అనేకమందిలో బలంగానే వుంది. ఇదే కోణంలో, ఇదే అర్థంలో అనేక ప్రముఖ వార్తా పత్రికలు సంపాదకీయాలు, వ్యాఖ్యానాలు సైతం చేసాయి. ఆశ్చర్యపడాల్సినదేమంటే 'ఈ బిల్లు చట్టరూపం దాల్చకపోవడం మహిళా జాతికి తీరని నష్టమ'నే విధంగా అనేక మహిళా సంఘాలు తమ నిరసనలు తెలియచేస్తున్నాయి.

అన్ని సమస్యలకు పరిష్కారాలు తలకిందులుగా సూచిస్తున్నట్లే రాజకీయరంగంలో మహిళా ప్రాతినిధ్య సమస్యకు సైతం పరిష్కారాన్ని రాజకీయ పార్టీలు తలకిందులుగానే సూచిస్తున్నాయి. బిల్లు చట్టరూపం దాల్చకుండా వాయిదాపడడం వెనుక గల ప్రభుత్వ ప్రతిపక్షాల నిజాయితీ నిబద్దతను శంకించాల్సిన అవసరం, అవకాశం ఒకటి ఉన్నప్పటికి, అసలు ఈ బిల్లు చట్టరూపం దాల్చడం ద్వారా చట్ట సభల్లో ప్రవేశించే మహిళలు స్వతంత్రంగా స్వేచ్ఛగా రాజకీయ పాలనా కార్యక్రమాలను నిర్వర్తించే అవకాశాలున్నాయా? కులప్రాతిపదికనో, కులప్రాతిపదికతో సంబంధం లేకుండా (జనరల్)నో ఏదో ఒకరకంగా బిల్లు చట్టరూపం దాల్చినప్పటికి, తద్వారా ఎలాంటి రాజకీయ కుటుంబ వారసత్వం లేకుండా ఒక సాధారణ స్థాయి శ్రామిక వర్గ మహిళ చట్ట సభల్లోకి ప్రవేశించగలదా? ముఖ్యంగా రిజర్వేషన్ల ద్వారా చట్ట సభల్లో కూర్చోబెట్టడంతో రాజకీయ రంగంలో మహిళా చైతన్యం వెల్లివిరిసిందనడానికి నిదర్శనంగా భావించవచ్చా? లాంటి కొన్ని ప్రశ్నలకు సూటియైన, దాపరికం లేని సమాధానాలు రావల్సి ఉంది.

ప్రస్థుత సామాజిక స్థితిలో రెండోశ్రేణి వర్గంగా గుర్తించబడుతూ, బానిస స్థాయి స్థానాన్ని కలిగి ఉండి పోషణ కోసం భర్తమీదే ఆధారపడుతూ సాంఘికంగానూ, చట్టాలలోనూ పురుషాధిక్యతకు లోబడే పరిస్థితుల్లో మహిళలు స్వేచ్ఛా స్వతంత్రాలతో రాజకీయ పరిపాలనా బాధ్యతలను, అధికారాలను నిర్వర్తించలేరని చెప్పడానికి మారుమూల గ్రామ మహిళా సర్పంచ్ మొదలు, బీహార్ ముఖ్యమంత్రి రాబ్డీదేవి వరకు అన్నీ ఉదాహరణలే. మహిళ అనాదిగా సామాజిక కట్టుబాట్లలో బంధించబడి దారుణమైన కుటుంబ హింసను ఎదుర్కొంటుంది. పోషణ విషయంలో పరాన్నజీవి పాత్రకు మహిళ మరోపేరుగా నిలబడుతుంది. తరాలుగా మహిళా జనాభాలోని సింహ భాగం మహిళల శ్రమ, విలువగా మారని ఇంటి, వంట పనుల్లో నిర్వీర్యమై తమ శ్రమ ద్వారా తనకు తన పిల్లలకు పోషణ వస్తువులను సమకూర్చుకోలేని అసహాయస్థితే ఈ పోషణ కోసం పరాధీన (తండ్రీ, భర్తలపై ఆధారపడడం) పరిస్థితికి కారణం. బయటి పనులు చేస్తూ సంపాదిస్తున్న కొద్దిమంది మహిళల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమి లేదు. ఆ విధంగా ఆర్జించి తీసుకువచ్చే డబ్బును

భర్త చేతిలో పెట్టని తప్పని పరిస్థితి ఉంది. ఈ స్థితికి తోడు పిల్లల పెంపకం మహిళలకు ఊపిరి సల్పనీయని గుదిబండ వ్యవహారంగా తయారైంది. ఇలాంటప్పుడు మహిళల సర్వసంపూర్ణ, స్వతంత్ర రాజకీయ పాలనాబాధ్యతలు నిర్వర్తించే లక్ష్యానికి ఈ సమస్యలు ఆటంకాలు కావా? అన్నది ఆలోచించాల్సిన విషయం. వెనుకటి నుండి తనంతట తాను, తనకోసమే జీవించే అధికారం స్త్రీకి లేనేలేదు. ఇంటిల్లిపాదికి భోజనాల్లో వండే కూరలు మొదలు, పడగ్గదిలోకి ఏ చీరకట్టుకోవాలనే విషయాల వరకు ఎక్కడా స్వేచ్ఛా స్వతంత్రాలు లేని మహిళా లోకానికి, స్వేచ్ఛగా రాజకీయ విధులను నిర్వర్తించే ఆత్మస్థైర్యం ఎలా ఉంటుంది. ఎంతెదిగినా, ఎంత సంపాదిస్తున్నా పెళ్లికి ముందు తండ్రికి కూతురుగా, పెళ్లి తర్వాత భర్తకు భార్యగా మాత్రమే గుర్తింపులో నున్న మహిళలకు, రాజకీయ పరిపాలనా నిర్వహణా వ్యవహారంలో స్వతంత్ర్య వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే అవకాశమే లేదు.

పుట్టింది మొదలు చదువుసంధ్యల్లో, ఆటపాటల్లో, వేషభాషల్లో, ఉద్యోగ వ్యవహారాల్లో, రోజవారి శ్రమల్లోనూ, సంస్కృతీ సంప్రదాయాల పేరుతో నిత్యం ఆత్మస్థైర్యాన్ని, ఆత్మాభిమానాన్ని గాయపరుస్తూ, ఆత్మనూన్యతాభావానికి గురౌతున్న పరిస్థితిని మార్చకుండా, కేవలం చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సంక్రమించే రాజకీయాధికారాన్ని ఎలా నిలబెట్టుకోగలరన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది రాజకీయ పార్టీలే కాదు, సమాజం కూడా. కేవలం చట్ట సభల్లో మహిళల ప్రవేశం కోసం రిజర్వేషన్లు పరిష్కారం అయినట్లు, ఈ సమస్యల పరిష్కారానికి ఏ రిజర్వేషన్లూ సరిపోవు. చివరికి చట్ట సభల మహిళా ప్రాతినిధ్య రిజర్వేషన్ చట్టం వచ్చినా మహిళా మౌలిక సమస్యల పరిష్కారానికి ఏమాత్రం పనికిరాదు. రాజకీయ రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని రిజర్వేషన్ల ద్వారా పరిష్కరించడం అంటే 'నిర్దేశిత శాతం ప్రకారం లెక్కలు కట్టగా వచ్చే సంఖ్యాపర పరిమాణంతో సంతృప్తి పడడంతో ప్రయోజనం లేదని రాజకీయ సంస్థలు గుర్తించాల్సి ఉంది. రాజకీయ రంగంలో మహిళా జనాభా ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ముందు వాళ్లకే సంబంధించిన పునాది పర సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు కొనసాగాలి. దీనర్థం ప్రస్తుత ప్రయోగం 'మహిళా రిజర్వేషన్' చట్టాన్ని వద్దని కాదు. కాని పునాదిలో సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకుండానే రాబోతున్న ఆ చట్టం అలంకార ప్రాయంగా మిగలడమేకాదు. తద్వారా చట్టసభల్లో నాయకురాళ్ల పేరుతో 'ప్రతిష్టించబడే మహిళలు 'శిలాప్రతిమలకు' ప్రతిబింబాలు గానే మిగిలిపోతారనడానికి ఎలాంటి సందేహం లేదు. ఇది కూడా మహిళలకు అవమానమే. ఇప్పటి దాకా జరుగుతున్న పరాభవాలకు తోడు ఇది అదనంగా మరో పరాభవం. కాబట్టి ముందుగా జరగాల్సిన మార్పు పునాదిలో ఆ దిశగా కృషి కొనసాగాలి. పునాదిలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం సమాజంలో మహిళలకున్న స్థానం, స్థితిగతులపై అరమరికలు లేని, నిరంతర చర్చ జరగాల్సి ఉంది. తరాలుగా మహిళా చైతన్యానికి, స్వేచ్ఛకు ఆటంకంగా స్థిరపడిపోయిన సామాజిక కట్టుబాట్లు, పురుషాధిక్యత నుండి, గృహబానిసత్వాల నుండి మహిళ విముక్తి కావలసి ఉంది. స్త్రీని కించపరిచే, తక్కువ చేసే, పురుషాధిక్యత కింద అణగి మనిగి ఉంచే స్వభావంతో ఉన్న ప్రస్తుత విద్యా విధానాన్ని చట్టాల్ని, సంస్కృతిని, సంప్రదాయాన్ని మార్చాల్సి ఉంది. మహిళలకు తప్పనిసరిగా చదువు, చదవని మహిళలకు తప్పనిసరిగా ఉపాధి అవకాశాలు సంపూర్ణంగా లభించే అవకాశాలు కల్పించాలి. మహిళలకు ఉపాధి అవకాశాలంటే, బీడీలు చుట్టడం, పచ్చళ్ళు చేయడం, అల్లికలల్లడం, మసాలాలు కొట్టడం, లాంటివి కాదు. ఇవికూడా ఉపాధులే, కాని ఇవి ప్రస్తుత సమాజంలో మహిళల కోసమే, మహిళలే నిర్వహించాల్సిన ప్రత్యేక శ్రమలుగా స్థిరపడిపోతున్నాయి. ఇది మార్చకపోతే మహిళల్ని మహిళలుగానే నిలిపి వుంచే శ్రమ విభజనను కొనసాగించడమే అవుతుంది. మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడమంటే కేవలం ఉపాధి అవకాశం రావడమే కాదు కావల్సింది. ఆ ఉపాధి ద్వారా లభిస్తున్న ఆదాయాన్ని ఖర్చు చేసే విషయంలో అమెకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండేవిధంగా మహిళల ఆర్థిక స్వతంత్రానికి, ఆర్థిక స్వేచ్ఛకు నిజమైన అర్థం అదే. తను కోరుకున్న పురుషునితో జీవితాన్ని పంచుకునే స్వేచ్ఛతోపాటు, తన స్వేచ్ఛకు, ఆటంకంగా మారి తనపై ఆధిపత్యం అణచివేతను కొనసాగించినపుడు వదులుకునే నిజమైన వైవాహిక సంబంధాలు ఏర్పడే అవకాశాలు ఉండాలి. ఇందుకు ఆస్తిహక్కు ఎంతో అవసరం. మహిళల ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని భంగపరిచేటటువంటి, ఏ చిన్న చెడుగులనైనా సమాజం పూర్తిగా వదిలేయాల్సి ఉంది. ఇన్ని రకాలుగా పునాది మారితేనే ఉపరితలంలో మహిళలు రాజకీయాధికారాన్ని స్వేచ్ఛగా నిర్వర్తించగలరు.

చలం చెప్పినట్లు 'అసలు ఇంట్లో అధికారం, బయట అధికారం సంగతి కాదు కావల్సింది. స్త్రీకి కావలసింది తనమీద, తన జీవితం మీద, తన శరీరం మీద, హృదయం మీద, సంపూర్ణాధికారం" ఎలాంటి ఆటంకాలు, పరిమితులు లేకుండా ఈ అధికారాలన్నీ వాళ్లు అనుభవిస్తేనే ఆ తర్వాత వాళ్లు అనుభవించాల్సిన రాజకీయాధికారానికి సార్థకత చేకూరుతుంది. అప్పుడు చట్ట సభల ప్రవేశానికి రిజర్వేషన్లు అవసరమే లేదు. □

సద్దాం హుస్సేన్ - ఒక అంచనా

- వి. శ్రీహరి

(గత సంచిక తరువాయి)

- ఈ యుద్ధంలో షా వ్యతిరేకులు గెలిస్తే, ఇరాక్ ఓడితే ఆ ప్రాంతమంతా మత ఛాందసులు కబంధ హస్తాలలోకి పోతుంది. సాధించిన ప్రగతి కుప్పకూలిపోతుంది. అపారమైన చమురు నిక్షేపాలు అమెరికా ప్రభావం నుండి తొలగి పోతాయి. మత ఛాందసుల భయం స్థానిక ప్రగతి వాదులది. చమురు బయం అమెరికాది. ఇద్దరు పోరాడవలసింది షాను కూల్చిన మతఛాందసులను, రెండు భయాలు చేతులు కలిపాయి. సద్దాం నాయకత్వాన ఇరాక్ అమెరికా సహాయం పొందింది. అమెరికా జీవ, రసాయనాలతో సహా అన్ని ఆయుధాల వుత్పత్తికి లోతైన సహకారం అందించింది. రసాయన ఆయుధాలు ఇరాక్ దాటుతున్నదని ఆరోపించే తీర్మానాలను ఆనాడు అడ్డుకున్నది. ఐక్యరాజ్య సమితిలో తన మారణాయుధాల ఉత్పత్తి గురించి 11,800 పేజీల పత్రం ఇరాక్ ఇచ్చింది. అందులో 8 వేల పేజీలు చింపేసి భద్రతా మండలికి యివ్వాలని అమెరికా షరతు. అవి బయటపడితే ఇరాక్ కాక అమెరికా నేరస్తురాలౌతుంది. "మా ఆయుధాల కొనుగోళ్ల బిల్లులు మీ దగ్గరే వున్నాయి" అని ఇప్పుడు సద్దాం చెప్పే నిజం మనకు మరొక ఆధారం. పోర్చుగల్, ఫ్రాన్స్, ఇటలీలు యురేనియం అమ్మాయి. ఈ బిల్లుల ఖర్చు అప్పులు, సౌదీ అరేబియా, కువాయట్‌ల ఆర్థిక సహకారం కీలకం.

ఇరాక్-ఇరాన్ రెండూ అలసిపోయాయి. అభివృద్ధి సమృద్ధిగా అవకాశాలు వున్న దేశాలు ఇరాన్ నిర్వీర్యమైపోగా, ఇరాక్ 80 బిలియన్ డాలర్ల విదేశీ అప్పులో కూరుకుంది. పదేళ్ల అభివృద్ధి కుంటుపడింది. రెండు దేశాలు రాజీపడ్డాయి. నిర్వీర్యమైన ఇరాన్ భయం వదలిన అమెరికా అలసి అప్పుల పాలైవున్న ఇరాక్ తన చెప్పు చేతుల్లో వుంటుందని అపారంగా వున్న దాని చమురునిధులను కారుచౌకగా కొట్టేయాలని ఆశించింది. సోవియట్ పతనోన్ముఖమై వుండడం దాని ఆశలను చిగురింపజేసింది.

కాని సద్దాం కాదనలేదు. తనదేశం త్యాగం చేసి, నెత్తురోడ్చి అప్పుల పాలై ఇరాన్‌ను ఓడించడం ద్వారా, ఆ ప్రాంతం అరబ్ ప్రాంతంగా మిగిలింది. లేకుంటే అమెరికా పనుపున షా కాలంలో సైనికంగా అపారంగా బలిసిన ఇరాన్ ఇస్లామిక్ రాజ్యం విస్తరించి వుండేది. (ఈ యుద్ధ సమయంలో సహితం దొంగచాటుగా ఇరాన్‌కు అమెరికా ఆయుధాలు అమ్మింది. అదే కిసింగర్ దోషిగా నిల్చిన "కాంట్రా స్కాండల్"గా ప్రఖ్యాతి చెందింది) కాబట్టి సౌదీ, కువాయట్‌లు యుద్ధం కోసం ఇరాక్‌కు యిచ్చిన అప్పులు రద్దు చేయాలనేది సద్దాం వాదన. సద్దాంకు, అమెరికా రాయబారికి కువైట్‌పై ఇరాక్ దాడి అనే ఘటనకు సరిగా వారం ముందు జరిగిన చర్చల్లో అమెరికా రాయబారి పాము చావకుండా, కర్ర విరగకుండా సమాధానం చెప్పాడు. కారణం ఇరాక్‌లో చమురు ప్రయోజనాలేగాదు ఇస్రాయల్‌కు సమవుజ్జీగా ఆదేశం పెరగరాదనే ఆకాంక్ష గూడ అమెరికాకు వుంది.

అమెరికా సైనిక ప్రవేశానికి, చమురు దోపిడీకి సద్దాం అమెరికా చేతులో పావు కాదలచుకోలేదు. అరబ్ ప్రజల వ్యతిరేకత దీనికి కీలకం. అందుకే ఇరాక్‌లో అమెరికా జోక్యానికి ఒక కారణం వెతకసాగింది. సౌదీ, కువాయట్‌లచే, ముఖ్యంగా కువాయట్ చేత అప్పు తీర్చమని వత్తిడి పెట్టింది. యుద్ధంలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం అడ్డుకున్నది. కాని అమెరికా కృతజ్ఞత మీద అపార విశ్వాసం ఏర్పర్చుకున్నాడు సౌదీ. అమెరికా ఉద్దేశం వేరు. కువాయిట్, ఇరాక్ చమురు క్షేత్రాలు ఒకదానికొకటి ఆనుకొని వున్నాయి. నేలమీద కనపడే సరిహద్దు, భూగర్భంలో గీయలేదు. దీనిని అవకాశంగా తీసుకొని సాంకేతికంగా కువాయత్‌ను రెచ్చగొట్టింది. నిట్టనిలువుగా జరగవలసిన డ్రిల్లింగ్‌ను, ఇరాక్ నిక్షేపాలలో చమురు తీసుకునేలా ప్రక్కదాటం (శ్లాంట్) డ్రిల్లింగ్ ప్రారంభించింది. కువాయట్ అమెరికా ప్రోత్సాహం, సహాయపు వాగ్దానం లేకుండా కువాయట్ ఇందుకు సాహసించింది. అనగలమా!ఇదీ కువాయిట్‌పై సద్దాం ఇరాక్ దాడికి మూలం.

ఈ దాడి సహేతుకమా? అప్పుల విషయంలో అమెరికాతో అనుభవం తరువాత, కువాయిట్ దొంగతనాన్ని ఆపే మరొక మార్గం వుందా? అలా లేదని ప్రపంచాన్ని నమ్మించ గలిగే వరకు సద్దాం ఆగివుండవలసిందా? సమాధానాలుగౌరవ ప్రదంగా

చెప్పలేని ప్రశ్నలు ఇవి. అయినా కువాయిట్ నుంచి సేనలను ఉపసంహరించుకోవాలని ప్రపంచం కోరింది. దానిని పెడ చెవిన పెట్టడం సద్దాం వేసిన పెద్ద తప్పటడుగు ఫలితం ఇరాక్ ప్రజలు అనుభవించారు. కాని, గతంలో ఎన్ని అక్రమ దండయాత్రలు జరగలేదు' వాటన్నిటినీ ప్రపంచం ఇలాగే శిక్షించిందా?

సద్దాం పైన వివరించినట్లు వెస్ట్ మినిస్టర్ పద్ధతి ప్రజాస్వామ్యంలో ప్రజాతంత్ర వాదికాదు. అలాంటి ప్రజాతంత్ర వ్యవస్థ నెలకొనేందుకు అవసరమైన సామాజిక పునాదులు పశ్చిమాసియాలో ఏదేశములోనూ లేవు. మనదేశంలో రిప్పన్ పాలన నాటినుంచే అలాంటి సంస్కృతికి బీజాలు పడ్డాయి. చైనాలో ఆ సంస్కృతి లేదు. నూతన ప్రజాస్వామికం అక్కడ ఏర్పడింది. అక్కడా తమ తరహా నూతన ప్రజాస్వామికం ఏర్పడాలని సామ్రాజ్య వాదులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు జరుగుతున్నదదే. అలాంటిదో, మరొకలాంటిదో ప్రజాస్వామిక రూపం ఏర్పడేందుకు ఇరాక్‌కు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రశాంతంగా సాగిన ఒక దశాబ్దా చరిత్ర అయినా వుందా? కాని ఇరాక్ ప్రజలు అమెరికా "ఆంక్షలను" పది సంవత్సరాలు అనుభవించారు. సద్దాం నాయకత్వమే కొనసాగింది. నియంత కనుక ప్రజలను ఉక్కుపాదాలతో అణచివేశాడని అన్నారు. నిజమనుకుందామంటే, అమెరికా "విముక్తి సైన్యాన్ని" వారు ఆహ్వానించలేదు. నియంతృత్వానికి బాసటగా నిలిచిన ఏతరహా సైనికులను పట్టివ్వలేదు. విగ్రహాలు పడగొట్టారుగదా అనచ్చు? ఎంత మంది? ఎవరు?

□

(సమాప్తం)

(6వ పేజీ తరువాయి)

పెళ్లి ప్రయివసీ కాకపోవచ్చు. కాని వారి తదనంతరం జీవితం వ్యక్తిగతమయినదే. వారిగురించి వివరాలు జనానికి చెప్పడం అవసరం లేదు. అయితే జనం హృదయాల్లో నిలిచి ఉండాలనుకునే ప్రజల మనుషులు ప్రయివసీ పేరుతో జనాన్ని చావబాదరు. ఆ విషయం చాలా తక్కువ మందికి అర్థం అవుతుంది. మనకు రాజకీయమయినా, సినీజీవితమయినా కుటుంబ వారసత్వ వ్యవహారంగా మారింది. తమ ఇమేజ్‌ను సొమ్ముచేసుకుందామనే ధ్యాసతో, తమ వారిని తమ వారసులుగా నిలబెట్టాలనే లక్ష్యంతో వ్యవహరించే వారు ప్రయివసీ గురించి మాట్లాడడం మరొక వింత. కొడుకు, తమ్ముడు, మేనల్లుడు, అల్లుడు సినీ హీరోలు కావాలనుకునేవారు ఎక్కువ. అన్నచాటున హీరో అయినవారు, అల్లుడి ఇమేజ్‌తో నిర్మాతలుగా మారి బాగుపడిన వారు, కొడుకును హీరో చేసేందుకు ప్రయత్నించేవారు ప్రయివసీ గురించి మాట్లాడకపోవడం మంచిది.

రక్షణ అధికారులు అర్థరాత్రి ఎవరితో మాట్లాడుతున్నారు ఏం చేస్తున్నారు. వారి బెడ్ రూంలో ఎవరున్నారు అని తెహల్కా విలేకరులు వీడియో తీసారు. వారు రక్షణ వస్తువులు సామగ్రి కొనుగోలు కమిషన్ గురించి లంచాల గురించి చర్చించుకుంటున్న విషయం బయట పడింది. అది ప్రయివేట్ వ్యవహారం అంటే అంతకన్న జోక్ ఏమిటి. దేశాన్ని అమ్మకానికి పెట్టిన ఈ అధికారులు ఆఫీసు పనివేళలు దాటిన తరువాత లంచాలు కుదుర్చుకుంటూ ఆ విషయాన్ని గుట్టుగా ఉంచడం కోసం దాన్ని ప్రయివసీ అంటారా?

సమాజానికి అవసరం లేని వ్యక్తిగత వివరాలజోలికి పత్రికలు టివిలు పోగూడదు. వారు ప్రజలమనుషులే అయినా వారి భార్య పిల్లలకు ప్రజాజీవనంతో సంబంధం ఉండదు వారి గురించి వివరాలు ఇవ్వవలసిన అవసరం లేదు. ఆ విధంగా ఇవ్వడం వల్లనే కళల్లో అనర్హులకు వారసత్వం లభిస్తున్నది. జనం కూడా ఫలానా వారి బంధువు అనే దృష్టితో కళలను నాయకత్వ లక్షణాలను ఆపాదించకుండా అవి ఉంటే మెచ్చుకుని లేకుంటే తిరస్కరించే స్థాయిని సమకూర్చుకోవాలి. అపరిమితమయిన అభిమానానికి, వ్యక్తి పూజకు బానిసలయితే అది వెనుకబడిన తనమే అవుతుంది కాని, నాగరికత సంస్కారం ప్రగతి అనిపించుకోదు. ప్రయివసీ అనేది వ్యక్తి ఇంటిగుట్టును కాపాడే హక్కే కాని తమ జీవితంలో నల్ల మచ్చలను కాపాడుకునే కవచం కాదని తెలుసుకోవాలి.

□

గత పక్షం సమీక్షలో 'దేశీయం' శీర్షికను **"వ్యవసాయ రంగంలో ద్రవ్య పెట్టుబడి ఋణవిధాన అంశాలు-ఓ పరిశీలన"** వ్యాసానికి సంబంధించిన తరువాయి భాగాన్ని స్థలాభావం వల్ల అందించలేక పోతున్నాం. వచ్చే సంచికలో ప్రచురించగలం.

-సంపాదకులు

కాశ్మీరు లోయలో న్యాయపోరాటం అదృశ్యమైనవారి ఆచూకీకోసం తలిదండ్రుల ఆకలి సమ్మె

ఎవరు ఎవర్ని చంపినా, ఎందుకు చంపినా - కాశ్మీర్ లోయలో చంపుడు కార్యక్రమం కొనసాగుతూనే వుంది. మిలిటెంట్లూ - సైనికులూ మాత్రమేగాక సామాన్య జనం - కేవలం కాశ్మీర్ వాసులయినందున మరణిస్తున్నారు.

ఈ ఏప్రిల్ 17 నుంచీ 24 వరకూ ఒక వారం రోజుల పాటు అకారణంగా అదృశ్యమైన వారి తలిదండ్రులు - నిరశన దీక్ష (హంగర్ స్ట్రయిక్) చేశారు. అదృశ్య వ్యక్తుల తలిదండ్రుల సంఘం (అసోసియేషన్ ఆఫ్ డిసప్పియర్డ్ పెర్సన్స్) 1994లోనే ఏర్పడింది. ఉద్యమ అవసరాల రీత్యాగాని తదితర కారణాలచేతగాని కొందరు - చెప్పకుండా ఇంట్లోంచి వెళిపోతారు. ఇది ఒక రకం. మరొక రకం సైనికులూ, పోలీసులూ రహస్యంగా కొందరు వ్యక్తుల్ని తీసుకుపోయి దాచేస్తారు. లేక చంపేస్తారు. వాళ్లు మిలిటెంట్లు కారు, సామాన్య ప్రజలు. కనుక తలిదండ్రులు వారి ఆచూకీ కోసం ఆందోళన చెందడం సహజం. మావాళ్లు ఫలానా రోజునుంచీ కనపడటం లేదని తలిదండ్రులు ప్రభుత్వంతో, సైనికాధికారుల్తో, పోలీసుల్తో ఎంత మొత్తుకున్నా ఫలితం శూన్యం. అంచేత అటువంటివి జరగకుండా సంఘటితంగా పోరాడాలని 1994లో సంఘంగా ఏర్పడ్డారు. అప్పటినుంచీ అనేకసార్లు అనేక విధాల తమ సమస్యల్ని ఎలుగెత్తి చాటారు. ఈ జనవరిలో సంఘం జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వానికి - తమ సమస్యలకు సమాధానం చెప్పమని డిమాండ్ చేస్తూ రెండు నెలల నోటీసిచ్చింది. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆకలి సమ్మె చేసింది.

కాశ్మీర్‌లో సాయుధ పోరాటం 1989లో ప్రారంభమైంది. మిలిటెంట్లకూ-ప్రభుత్వ పోలీసుల, సైనికులకూ మధ్య ఈ పోరాటం కొనసాగుతూనే వున్నది. లా అండ్ ఆర్డర్ పేర అరెస్టుల్లో నేటికి 8,000 (ఎనిమిదివేల) మంది మాయమయ్యారు. వారిలో అత్యధిక సంఖ్యాకులకు పోరాటంతో సంబంధం లేదు. ఇన్నేళ్ల పోరాటంలో ఆమాట-చివరికి-ప్రభుత్వం కూడా ఒప్పుకుంది. ముఖ్యమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ గత మూడేళ్లుగా అంటే 2000,2001, 2002సం॥ల్లో రక్షణ విభాగం వారు చేసిన పనులపై ఫిబ్రవరి 25న ఒక ప్రకటన చేశాడు. రాష్ట్ర అసెంబ్లీలో ఆయన "ఈ మూడేళ్లలో 3,744 మంది మాయమయ్యారు. 2000లో 1553 మంది, 2001లో 1586 మంది, 20002లో 605 మంది అదృశ్యమయ్యారు" అని అంగీకరించాడు. ఈ ప్రకటనకు కొంచెం ముందు 2002 జులై 18వ తేదీన ఆనాటి నేషనల్ కాన్ఫరెన్సు ప్రభుత్వపు హోం మంత్రి ఖలీద్ నజీబ్ సాహ్రావర్ది 'కాశ్మీర్‌లోయలో పోరాటం ప్రారంభమైనప్పటినుంచీ 3,184 మంది మాయమయ్యార'నీ అసెంబ్లీలో అధికారికంగా ప్రకటించారు. ఈ అంకెలు ఎంతవరకూ నిజం అనే సంగతి అలా వుంచితే ప్రభుత్వమే స్వయంగా అంతమంది వ్యక్తులు చట్టం/ప్రభుత్వం/సైన్యం/ పోలీసులు చేతుల్లో మాయమయ్యారని అంగీకరించిందన్నమాట.

1989నుంచి కాశ్మీరులో అనేక ప్రభుత్వాలు మారాయి. 2002లో అధికారంలోకొచ్చిన కొత్త ముఖ్యమంత్రి ముఫ్తీ ముహమ్మద్ సయీద్ గారి కుమార్తెను మిలిటెంట్లు కిడ్నాప్ చేసిన నేపథ్యంలో 'అధికారంలోకొస్తే నల్లచట్టాన్ని రద్దు చేస్తా'నని వీరాలాపం చేశాడు. యధాప్రకారం ఆయన తన మాటలో, కేవలం పదవిలోకొస్తూ సంతోషంతో ఆవేశంతో చేసిన ప్రకటన తప్ప ఆచరణ ఆవగింజంతకూడా లేదని మరోసారి రుజువయ్యింది. ఇటీవల కొత్తగా ప్రమాణ స్వీకారాలు చేసిన ప్రభుత్వాలన్నిటికి - మానవ హక్కుల్ని పరిరక్షిస్తాం అనడం ఒక అలవాటుగా మారిపోయింది. "కామన్ మినిమమ్ ప్రోగ్రాం" ... వాగ్దానాలన్నీ ఓట్ల సంబడం మర్నాడే గాలికెగిరిపోతున్నాయి. సయీద్ ముఖ్యమంత్రయ్యాక 2002 నవంబర్ 2 నుంచీ (ఏప్రిల్ 2003) నేటి వరకూ తలిదండ్రులు 26 మంది మిస్సింగ్ కేసులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ప్రభుత్వానికి గత ప్రభుత్వాన్ని నిందించడం ఒక ఆనవాయితీగా మారింది. అదృశ్యమైన వ్యక్తుల తరఫున కనీసం రెండు లక్షలమంది బాధితులు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, అది నిస్సహాయంగా తాత్కాలిక ప్రకటనలూ, వాయిదాలూ చేస్తూ ఊరుకుంటున్నది. ఇది ప్రభుత్వాల నిస్సహాయం మాత్రమే కాదు, మొత్తంగా పాలక వర్గాల, జాతుల,

అగ్ర వర్ణాల సమస్య. రాను రాను పెరుగుతున్న ఈ మిస్సింగ్ కేసుల్ని చూసి రాజకీయ నాయకులూ, ప్రభుత్వ వర్గాలూ గుండెబాదుకోవడం తప్ప ఒక్కటంటే ఒక్క ఓదార్పు కనుచూపు మేరలో కనపడటం లేదు.

ఇక్కడ కొంచెం సాంకేతిక వివరాల్లోకి వెళదాం. 1999లో జమ్మూకాశ్మీర్ ప్రభుత్వ హోంశాఖ ఒక జీ.ఓ. విడుదల చేసింది (జి.ఒ.ఎన్.723-జి.ఆర్.-జి.ఎ.డి. ఆఫ్ 1990, తేది. 10-07-1990 రీడ్ విత్ జి.ఒ.ఎన్.1073 జి.ఆర్ ఆఫ్ 1990, తేది. 19-11-1990) దీని ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఒక స్క్రీనింగ్ కమ్ కో-ఆర్డినేషన్ కమిటీలు ఏర్పడి - అదృశ్యమైన వ్యక్తుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి ఆయా వ్యక్తులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాలి. ఈ కమిటీల్లో సైనికాధికారులూ, కొందరు పౌరులూ సభ్యులుగా ఉండాలి. జీవో విడుదలయిందిగాని, పని జరగలేదు. ఆ కమిటీలు ఎన్నడూ సమావేశం కాలేదు. సైనికాధికారులూ, పోలీసులూ సభ్యులుగా ఉన్న సంఘాలు సరిగ్గా పనిచేస్తాయన్న నమ్మకం తలిదండ్రుల సంఘానికి ఎన్నడూ లేదు. నేరస్తులు తమ నేరాన్ని తామే విచారించుకుంటారా?

డివిజనల్ కమిషనర్ 2000సం॥లో అదృశ్యవ్యక్తుల వివరాలు సంబంధిత ప్రాంతాల డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో వారి కుటుంబ సభ్యులు తెలపాలని ఒక ప్రకటన ఇచ్చాడు. ఆ ప్రకటనకు స్పందిస్తూ వేలాది మంది ఆయా డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల్లో పూర్తి వివరాలు ఇచ్చారు. ఆ వివరాల ఆధారంతో తమవారి ఆచూకీ తెలుస్తుందేమో, విచారించాక అధికార్లు తమకు తెలుపుతారేమో తమవార్ని చూసుకోవచ్చునేమోనని కొండంత ఆశ పడ్డారు. ఆ పిటిషన్లు ఏమయ్యాయో ఈనాటికీ అతీగతీలేదు.

2000, ఆగస్టు 30 తేదీన ప్రాంతీయ, జాతీయ స్థాయిలో అదృశ్య వ్యక్తుల వివరాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్.హెచ్.ఆర్.సీ) స్పందిస్తూ (సూమోటో కాగ్నిజన్స్) రాష్ట్ర ప్రభుత్వాలకూ, తలిదండ్రుల సంఘానికీ నోటీసులు జారీచేసింది. తలిదండ్రుల సంఘం మరోసారి ఎంతో ఆశతో మళ్లీ వివరాలన్నీ పంపించింది. యథాప్రకారం జాతీయ మానవ హక్కులకమిషన్ కూడా ఆతరువాత ఆ రిపోర్టుల మీద ఏ చర్య తీసుకోలేదు.

సుప్రీంకోర్టు ఆదేశాల్నీ, మానవ హక్కుల కమిషన్ ఆదేశాల్నీ పాటించవలసిన రాష్ట్ర న్యాయశాఖ నోరు మెదపకపోతే, ఆదేశాల్ని అమలు పరచకపోతే వారిపై కోర్టుధిక్కారనేరం మోపవలసిన పని సుప్రీం కోర్టు చెయ్యాలి కదా. ఆ విషయంలో తానూ సుప్రీంనేనని మరింత ఘోరమైన మౌనం పాటించింది. ఇక కుటుంబ సభ్యులు ఇతర మార్గాల్ని అన్వేషించనారంభించారు. ప్రజా సంఘాన్ని ఆశ్రయించడం, పత్రికలవార్ని ఆశ్రయించడం.

2002లో తలిదండ్రుల సంఘం సంతకాల ఉద్యమం తీసుకుంది. వేలాదిమందితో సంతకాలు చేయించి (బంధువుల్లో కొందరు చదువురాని వారున్నారు) ఒక సుదీర్ఘమైన పిటిషన్ రూపొందించి. అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలకు పంపించింది. ఈ సంతకాల ఉద్యమంలో వివిధ యూరప్, ఆసియా దేశాలకు సంబంధించిన మానవ హక్కుల సంఘాలవారు కూడా కలిశారు. ఆ పిటిషన్ల కాపీలను సంబంధిత ఉన్నతాధికారులకు కూడా పంపించి న్యాయం చెయ్యవలసిందని డిమాండ్లు చేశారు.

అదృశ్యమై పోయిన వారి బంధువులూ, తలిదండ్రులూ విడిగానూ, సంఘటితంగానూ తమవారి జాడ తెలుసుకోవడం కోసం కొట్లాడుతున్నారు. అన్ని స్థాయిల్లోనూ సర్వయత్నాలూ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం తలిదండ్రుల సంఘాలూ, పౌరహక్కుల సంఘాలు చేస్తున్న డిమాండ్లను పట్టించుకోవడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని ప్రభుత్వాలూ నిస్సహాయత వ్యక్తపరుస్తున్నాయి. ఒకవేళ చర్యతీసుకుంటే వారి చర్య సైన్యాన్ని తప్పు పట్టినట్టవుతుంది. సైన్యాన్ని నైతికంగా బలహీన పరచినట్టవుతుంది. కనుక ప్రభుత్వాలు చర్యతీసుకోవడం సంగతలా వుంచి కనీసం ఒక స్పష్టమైన ప్రకటన కూడా చెయ్యవు.

1998 జులై 17న అమలులోకొచ్చిన రోమ్ సూత్రం ప్రకారం మాయం చెయ్యడం అనేది మానవతపట్ల నేరం చేసినట్టు. అలా మాయం చేసిన వ్యక్తులు (సైన్యం/పోలీసులు) అంతర్జాతీయ నేర న్యాయస్థానం ప్రకారం నేరస్తులు. ఆ సైన్యాన్ని మొత్తంగాగాక మాయం చేసిన వ్యక్తుల్ని నేరస్థులుగా చేసి విచారించవచ్చు. చట్టాన్ని ఉల్లంఘించినట్టు శిక్షించవచ్చు. కాని ఆపని చేసే నాధుడు లేడు.

మాయమైనవారి బంధువులు, తలిదండ్రులూ - ఆకలి సమ్మెచేస్తూ తమ డిమాండ్లు ప్రకటించారు.

*. జమ్ము కాశ్మీర్‌లో చట్టవ్యతిరేకంగా మనుషుల్ని మాయం చేయడం ఆపాలి. ఇకపై ఇటువంటి దుర్మార్గ చర్యలు ఎంతమాత్రం జరగకూడదు.

*. బలవంతంగా ఎత్తుకుపోయి మాయం చెయ్యడం ఏదేశంలోని

(మిగతాది 21వ పేజీలో)

సోషలిజమే భవిష్యత్తు

- డి.పాపారావు

ఫ్రెంచి విప్లవపు నినాదాలైన "స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం" చాలా మందికి తెలిసినవే. ఈ నినాదాల ప్రాతిపదికనే పెట్టుబడిదారీ వర్గం ప్రజలను ఆకట్టుకోగలిగింది. అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. ప్రపంచంలోని ప్రతి మూలా పెట్టుబడిదారీ విప్లవాలకు ఈ నినాదం ఆలంభనగా వుంటూ వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందు వున్న ఫ్యూడల్ లేదా భూస్వామ్య సమాజంలోని పెత్తందారీ తనాన్ని, ఆధిపత్యాన్ని ఈ నినాదం సవాలు చేసింది. ప్రజలందరూ సమానమేనని, వారందరికీ స్వేచ్ఛా సోదర భావాలను ప్రసాదిస్తానని పెట్టుబడిదారీ వ్యవస్థ వాగ్దానం చేసింది. ఈ క్రమంలో భాగమే పెట్టుబడిదారీ వ్యవస్థ క్రింద వర్గాలతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తికీ ఒకే ఓటు తమ పాలకులను ఎన్నుకునే హక్కు వంటివి వచ్చాయి. అంటే యావన్మంది ప్రజలు "ప్రజాస్వామ్యం"లో భాగస్వాములేనని పెట్టుబడిదారీ వ్యవస్థ హామీని ఇచ్చింది. ఈ మేరకు చట్టాల రూపేణా కూడా ఒక వ్యవస్థను నెలకొల్పుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ నూతన వ్యవస్థ పాత ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యాంగ యంత్రాన్ని బద్దలు చేసి ఒక నూతన రాజ్యాంగ వ్యవస్థను (బ్యూరాక్రసీ లేదా అధికార గణం) ఏర్పరచుకుంది. చరిత్ర క్రమంలో దోపిడీ వ్యవస్థలు ఆరంభమైన తరువాత మారిన ఈ దోపిడీ రూపాలకు అనుగుణంగా రాజ్యవ్యవస్థలూ మారుతూ వచ్చాయి. దీనికి తార్కాణాలే చరిత్రలో మొట్టమొదటి దోపిడీ వ్యవస్థ అయిన బానిస వ్యవస్థ నుంచి దాని తరువాతి కాలపు ఫ్యూడల్ వ్యవస్థలోకి మార్పు అనంతరం రూపురేఖలు మారిన రాజ్య వ్యవస్థ. ఇక అనంతరం ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ తరువాత ఏర్పడిన పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా నూతన తరహా రాజ్యాన్ని, పరిపాలనా వ్యవస్థనూ ఏర్పరచుకుంది. అంటే మారిన దోపిడీ రూపాలతో పాటుగా రాజ్య వ్యవస్థా మారుతూ వచ్చింది. ఈ నూతన రాజ్య వ్యవస్థల తీరు తెన్నులు ఆయాకాలాల ఉత్పాదక శక్తుల అభివృద్ధి స్థాయి, తదనుగుణమైన ప్రజల చైతన్యం స్థాయికి తగినవిగా వుంటూ వచ్చాయి. దీనర్థం చారిత్రకంగా మొట్ట మొదటి దోపిడీ వ్యవస్థ అయిన బానిస వ్యవస్థ తలెత్తే నాటికి ఉన్న అతి తక్కువగా అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులు, మానవుల విజ్ఞానం, సాంస్కృతిక స్థాయి మొదలైన పలు అంశాలకు అనుగుణంగానే ఆనాటి రాజ్యాంగ వ్యవస్థ ఉంటూ వచ్చింది. అయితే ఈ బానిస వ్యవస్థలో కాలక్రమేణా ఉత్పాదక శక్తులు, తదనుగుణంగా మానవ చైతన్యం పెరిగిన కొద్దీ మెల్ల మెల్లగా ఆ వ్యవస్థలోనే మార్పులు చోటు చేసుకోసాగాయి. బానిసలుగా జీవించిన ఆ వ్యవస్థలోని ప్రజానీకం తమ జీవితాలు మెరుగుపడాలని కోరుకోవడానికి మెల్ల మెల్లగా భౌతిక ఉత్పాదక శక్తుల అభివృద్ధి కారణం అయింది. అంటే మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే ఉత్పాదక శక్తులకూ, ఉత్పాదక సంబంధాలకూ మధ్య అపరిష్కృత ఘర్షణ ఏర్పడింది. దీనర్థం అప్పటి వరకూ బానిసలుగా జీవిస్తున్న ప్రజలు ఆ వ్యవస్థ తాలూకు బానిస - బానిస యజమాని సంబంధాలను బ్రద్దలు చేసుకొని అంతకంటే మెరుగైన వేరొక రకమైన వర్గ సంబంధాలను ఏర్పరచుకునేందుకు - అవసరమైన ఉత్పత్తి శక్తులు ఆవిర్భవించాయి. ఈ పరిస్థితిలోనే బానిస వ్యవస్థలోని బానిస-బానిస యజమాని సంబంధంపై బానిసల తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లు పలు ఒడిదుడుకుల తరువాత అంతిమ విజయాన్ని సాధించగలిగాయి. ఫలితంగా నూతన దోపిడీ రూపమైన, బానిస వ్యవస్థకంటే మెరుగైన వర్గ సంబంధాలు గల ఫ్యూడల్, భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. అయితే ఇక్కడ దోపిడీ రూపం మారింది. దీనికి కారణం నాటి ఉత్పాదక శక్తుల అభివృద్ధిస్థాయిలో భూస్వామ్య దోపిడీ వ్యవస్థ రూపాన్ని మించిన దానిని ఆశించటం, కోరుకోవటం సాధ్యమయ్యే పని కాదు. వివిధ కాలాలలో వున్న భౌతిక, ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అనుగుణంగానే ఆనాటి ప్రజల చైతన్యం, విజ్ఞానం, సాంస్కృతిక స్థాయి, ఆశలు, ఆకాంక్షలు అనివార్యంగా ఆధారపడి వుంటాయనే సత్యాన్ని మనం గుర్తుంచుకోవాలి.

ఇక అటు తరువాత ఫ్యూడల్ వ్యవస్థ కూడా దాని తాలూకు ఉత్పాదక శక్తులు అభివృద్ధి ఒక పరాకాష్ఠ స్థాయిని చేరుకొనే వరకూ మాత్రమే కొనసాగ గలిగింది. అనంతరం ఆ వ్యవస్థ కూడా అనివార్యంగా బానిస వ్యవస్థ లాగానే కుప్పకూలింది. అయితే తాను యధేచ్ఛగా కొనసాగగలిగినంత కాలం ఫ్యూడల్ వ్యవస్థ దాని

ముందరి వ్యవస్థ అయిన బానిస వ్యవస్థకు భిన్నమైన మరో రాజ్యాంగ యంత్ర రూపాన్ని ఆశ్రయించింది. ఈ ఫ్యూడల్ రాజ్యాంగ వ్యవస్థ అనేది ఆ వ్యవస్థ తాలూకు దోపిడీ అవసరాలు, ప్రజల చైతన్య, సాంస్కృతిక స్థాయికి అనుగుణమైనదిగా మాత్రమే వుంటూ వచ్చింది. తదనంతరం ఫ్యూడల్ వ్యవస్థ కూడా తన గర్భంలో జరిగిన పారిశ్రామిక విప్లవం తరువాత (ఉత్పాదక శక్తుల అభివృద్ధి) మరో నూతన దోపిడీ రూపమైన పెట్టుబడి దారీ వ్యవస్థకు తలవొగ్గవలసి వచ్చింది. పైన ముందుగానే పేర్కొన్నట్లుగా ఈ నూతన దోపిడీ రూపమైన పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని తాలూకు పాలకవర్గం నూతన రూపంలోని తమ దోపిడీని కొనసాగించేందుకు కొత్త తరహా రాజ్యాంగ వ్యవస్థపై ఆధారపడవల్సి వచ్చింది. ఈ నూతన రాజ్యాంగ వ్యవస్థ రూపమే బ్యూరాక్రసీ (అధికార గణం) ఈ బ్యూరాక్రటిక్ రాజ్యాంగ యంత్రం అనేది నూతన పెట్టుబడిదారీ వ్యవస్థను అధికార పీఠం పై కూర్చోబెట్టిన నినాదమైన స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం" మొదలైన వాటికి అనుగుణమైనది. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ చేయబడే మెజారిటీ వర్గమైన కార్మిక వర్గాన్ని పరిపాలించగలిగేందుకు గాను పెట్టుబడిదారీ దోపిడీ దారులకూ బ్యూరాక్రసీ రూపంలోని "నిష్పక్షపాత, నిబంధనల ప్రకారం నడుచుకునే" పరిపాలనా యంత్రాంగం అవసరమయ్యింది. రాజ్యాంగ యంత్రం అనేది దోపిడీ చేసే - దోపిడీ చేయబడే వర్గాల మధ్య రాజీ కుదిర్చేది అనే అర్థంలోను, "వర్గాలకు అతీతంగా" వుంటుంది అనే అర్థంలోను ఇది నిజం.

కానీ వాస్తవ జీవితంలో, వర్గాలు ఉన్నతంకాలం వాటి మధ్య వాటి వాటి ప్రయోజనాల తాలూకు వైరుధ్యం వుంటూనే వుంటుంది. పేరుకు ఎన్ని నినాదాలను ఇచ్చినా, అందరూ రాజ్యాంగ యంత్రం ముందు సరిసమానులేనని చెప్పినా, వాస్తవ ప్రపంచ వ్యవహారాలలో దోపిడీ వర్గానికి, దోపిడీ చేయబడే వర్గానికీ సరిసమానమైన స్థాయి, అవకాశాలు, పరిస్థితులు వుండవు. దీనికి తార్కాణమే పెట్టుబడి దారీ వ్యవస్థ నినాదమైన "స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం" తాలూకు లోగుట్టు. ఈ మొత్తం తర్కాన్ని నిరూపించేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గం తాలూకు అనుభవాలు, వాస్తవ జీవన పరిస్థితులు చాలు. కానీ ఇక్కడ పై నినాదం తాలూకు అసలు స్వరూపాన్ని అందరూ అర్థం చేసుకోగలిగేందుకు గాను కాస్తంత వివరణ అవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థ నినాదపు గుట్టును బహిరంగంగా కడుగుతూ లెనిన్ చేసిన రచనలైన "రాజ్యం, విప్లవము", "రాజ్యం" చక్కగా సరిపోతాయి.

వర్గసమాజంలో స్వేచ్ఛా, సమానత్వమూ, సౌభ్రాతృత్వాల నిజమైన పని తీరును లెనిన్ బహిర్గత పరిచాడు. ఈ సందర్భంలోనే ఆయన కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలలో మొదటిది స్వేచ్ఛను గురించినది. పెట్టుబడిదారీ సిద్ధాంతకారులు, పాలకులు స్వేచ్ఛ గురించి మాట్లాడిన మరుక్షణం, మనం స్వేచ్ఛ ఎవరినుంచి ఎవరికి అని ప్రశ్నించి తీరాలని తెలియచెప్పారు. వర్గ సమాజంలో అనివార్యంగా దోపిడీ చేయబడే వర్గంపై రాజ్యంగయంత్రం అణచివేత వుంటుంది. కాబట్టి పరస్పరం వైరుధ్య పూరితమైన ప్రయోజనాలు కల వర్గ సమాజంలో దోపిడీ చేయబడే వర్గం తాలూకు స్వేచ్ఛ అనివార్యంగా హరించబడుతుంది. అలాగే ఇక "సమానత్వం" విషయంలో కూడా. ఈ విషయంలో ఎవరికి ఎవరితో సమానత్వం అనే సాధారణ సమస్యను లెనిన్ విచారించాడు. దోపిడీ చేసే వర్గానికీ - దోపిడీ చేయబడే వర్గానికీ మధ్యన సమానత్వం ఎండమావి వంటిదేనని ఆయన వివరించాడు. దీనికి కొకొల్లలుగా తార్కాణాలను పేర్కొనవచ్చు. ఒక పెట్టుబడిదారీ రాజ్యం అందరూ "సమానమేనని" తాను చేస్తున్న ప్రకటనలకు అనుగుణంగా ఒక అత్యంత సాధారణ స్థాయి చట్టాన్ని చేయడాన్నే ఉదాహరణగా తీసుకుందాం. ప్లాట్‌ఫారమ్‌ల మీద ఎవ్వరూ ఏవస్తువునూ అమ్మరాదని పెట్టుబడిదారీ పరిపాలనా యంత్రాంగం ఒక చట్టాన్ని చేసిందనే అనుకుందాం. "ప్రజాస్వామ్యంలో అందరూ సరిసమానులే కనుక ఈ చట్టం యావన్మంది ప్రజలకూ ఒకే విధంగా వర్తిస్తుందని ఈ దోపిడీ వ్యవస్థను విశ్వసించే ఎవరైనా నమ్మితీరుతారు. చట్టం ముందు అందరూ సమానులే, చట్టం తన పని తాను చేసుకుపోతోంది అనే తరహా ప్రకటలను మనం తరచుగా వింటుంటాం. అయితే ముందుగా పేర్కొన్న ప్లాట్‌ఫారమ్‌లపై ఎవ్వరూ ఏదీ అమ్మరాదనే చట్టం భిన్న వర్గాలకు ఎలా విభిన్నంగా వర్తిస్తుందో చూద్దాం". వందల, వేల కోట్ల రూపాయల ఆస్తులు గల ఒక ధనవంతుడైన పెట్టుబడిదారు తాను ఉత్పత్తి చేసే సరుకును షోరూంలో అమ్ముకోగలడు. అతనికి తన సరుకును ప్లాట్‌ఫారమ్‌లపై అమ్ముకొనే ఆగత్యం లేదు. కానీ, తన దగ్గర వున్న కాస్తంత డబ్బుతో బఠానీలను కొని అమ్ముకొనే పేదవాడు అనివార్యంగా ఆ బఠానీలను ప్లాట్‌ఫారమ్‌లపైనే అమ్ముకోగలడు. షోరూంలు పెట్టటం ఆ సామాన్యుడికి సాధ్యమయ్యే పని కాదు. కాబట్టి చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పే కల్ల బొల్లి మాటలకు బలయ్యేది ప్లాట్‌ఫామ్‌లనే తమ జీవనోపాధికి అడ్డాలుగా చేసుకొన్న పేద

ప్రజానీకమే,ఇలా చెబుతూ పోతే స్వేచ్ఛా, సమానత్వం తాలూకు నిర్దిష్ట రూపాలైన సమావేశ స్వేచ్ఛ, అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ (వాక్ స్వాతంత్ర్యం), పత్రికలను పెట్టుకునే స్వేచ్ఛ వంటివి కూడా దోపిడీ సమాజంలోని భిన్న వర్గాలకు విభిన్నంగా అన్వయిస్తాయి. పెట్టుబడిదారీ దోపిడీలో రాజ్యాంగ యంత్రపు నిష్పక్షపాతత మాటున ధనికులకూ, పేదలకు మధ్య భిన్నమైన, పరస్పర విరుద్ధమైన న్యాయం మాత్రమే అనివార్యంగా జరుగుతుంది.

అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు ఉత్పాదక శక్తుల అభివృద్ధి పరాకాష్టను చేరుకున్న తరువాత ఆ వ్యవస్థ ఇచ్చిన నినాదమైన "స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం". నికార్సైన ఆచరణాత్మక రూపం ధరించేందుకు కావల్సిన వస్తుగత, భౌతిక సన్నివేశం ఏర్పడుతుంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలు ఈ నినాదాలు వాస్తవరూపం ధరించేందుకు ఆటంకంగా నిలుస్తాయి. ఆ పరిస్థితిలోనే ఈ ఉత్పాదక సంబంధాలను అంతమొందించే శ్రామిక ప్రజా విప్లవాలు జరుగుతాయి. కాగా, పెట్టుబడిదారీ వ్యవస్థ తొలుత ఏర్పడిన కాలంలో వున్న భౌతిక పరిస్థితుల (సాంకేతిక పరిజ్ఞానం వంటివి) పరిమితులలో ఆ వ్యవస్థను నడిపేందుకు బ్యూరాక్రటిక్ పరిపానా యంత్రాంగం మాత్రమే అనువుగా వుండగలదు. కానీ పెట్టుబడి దారీ వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు అనివార్యంగా కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయి. అంటే ఈ ఉత్పత్తి శక్తులు వాటిపై ఆధారపడి ఏర్పడిన ఉత్పాదక సంబంధాల మధ్య అపరిష్కృత తీవ్ర ఘర్షణ ఏర్పడే అనివార్య పరిస్థితి ఉత్పాదక శక్తుల పురోగమన క్రమంలో ఏర్పడి తీరుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిన తొలి దశలోను, దాని పురోగమన దశలోను వున్నటువంటి సమాచార వ్యవస్థ, ఇతర భౌతిక పరిస్థితుల వంటి ఉత్పాదక శక్తుల పరిమితులలో బ్యూరాక్రటిక్ రాజ్యాంగ యంత్రాంగం మాత్రమే ఏకైక పరిపాలనా రూపంగా కొనసాగగలదు. అటువంటి పరిపాలనా రూపం మాత్రమే వంచనాభరితమైన "స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం" నినాదాన్ని ప్రజల ముందు తీసి పూత పూసిన చేదు మందులా అమలు చేయగలదు. అంటే, బ్యూరాక్రసీ తాలూకు లక్షణాలుగా చెప్పబడే నియమనిబంధనల ప్రకారం పనిచేయటం, పక్షపాత ధోరణి లేకపోవటం, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం లేకపోవటం (భూస్వామ్య వ్యవస్థ, ఫ్యూడలిజం తాలూకు వాసనలైన) వంటి పైపై మెరుగులు పెట్టుబడి దారీ వ్యవస్థ తాలూకు ముందుగానే పలుమార్లు పేర్కొన్న పాలక వర్గ నినాదాలకు అనుగుణంగా వుంటాయి. తద్వారా బ్యూరాక్రటిక్ రాజ్యాంగ వ్యవస్థ ఒక ప్రక్క, పాలక వర్గపు దోపిడీ నినాదాలు, ఆలోచనా సరళికి, మరోప్రక్కన సామాన్య ప్రజానీకానికీ మధ్య వారధిగా వుంటుంది. సమాచార వ్యవస్థ, రవాణా వ్యవస్థ వంటి భౌతిక పరిస్థితులు పాలకులకు పాలితులకూ మధ్య వున్న దూరాన్ని, అందుబాటును పూడ్చి ఈ అగాధం లేని నూతన వ్యవస్థను ఏర్పరచలేనంత కాలం ఇదే పరిస్థితి కొనసాగుతుంది. అంటే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను అంతం చేసి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు తప్పని సరి అవసరమైన సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం ఆచరణలో సాధ్యం అయ్యేందుకు వస్తుగత సన్నివేశం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలోనే పరాకాష్ఠను చేరుకోవాల్సి వుంటుంది. దీనర్థం, పెట్టుబడి దారీ వ్యవస్థ తాలూకు బ్యూరాక్రటిక్ రాజ్యాంగ వ్యవస్థ రూపాన్ని బద్ధలు చేసి, దాని స్థానంలో మెజారిటీ శ్రామిక వర్గపు ప్రజాస్వామ్యానికి అనుగుణమైన కొత్త తరహా, రాజ్యాంగ వ్యవస్థను ఏర్పరచేందుకు అనివార్యంగా, తప్పని సరిగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పాదక శక్తుల అభివృద్ధి తగిన స్థాయిని చేరుకోవాల్సి వుంటుంది. ఆ పరిస్థితి ఏర్పడే వరకు ప్రపంచంలో జరిగే సోషలిస్టు విప్లవాలు సైతం-అనివార్యంగా వాటి ఉద్దేశ్యాలు ఎంత మంచివైనా అవికూడా ఎంతో కొంత మేరకు బ్యూరాక్రటిక్ రాజ్యాంగ యంత్రంపైనే ఆధారపడవల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితి ఫలితమే రష్యావిప్లవం మొదలుకొని నేటి వరకూ జరిగిన అన్ని సోషలిస్టు విప్లవాలు నిజమైన శ్రామిక వర్గ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులకు, వైఫల్యాలు. ఈ వైఫల్యాలు, ఒడిదుడుకులు పలు సందర్భాలలో సోషలిస్టు విప్లవ నేతల నిబద్ధతా లోపం మాత్రమే కారణం కాదు. దీనికి ప్రధాన కారణం ప్రపంచ వ్యాప్తంగా ఉత్పాదక శక్తుల అభివృద్ధి తగిన పరాకాష్ఠ స్థాయిని చేరుకోకపోవటం. అంటే వస్తుగత సన్నివేశం సోషలిస్టు సమాజ నిర్మాణానికి, నూతన సోషలిస్టు రాజ్య వ్యవస్థ ఆవిర్భావానికి తగిన స్థాయిలో వుండకపోవటం.

ఉత్పాదక శక్తుల అభివృద్ధి క్రమంలో ఒక అంశమైన సమాచార సాంకేతిక రంగ అభివృద్ధి ఈ మధ్య కాలం వరకూ నూతన సోషలిస్టు రాజ్యాంగ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన స్థాయికి చేరుకోలేదు. దీని ఫలితంగా సోషలిస్టు వ్యవస్థలలో కూడా శ్రామిక ప్రజానీకానికి, వారిని నడిపించే విప్లవ నాయకులకు మధ్య

వారధిగా ఒక తరహా బ్యూరాక్రటిక్ పాలనా యంత్రాంగం తప్పని సరి అయ్యింది. భౌగోళికంగా సువిశాల దేశాలలో జరిగిన సోషలిస్టు విప్లవాలు సమాచార, సాంకేతిక రంగ అభివృద్ధి పరిపక్వ స్థాయిని చేరుకోక పోవడం వలన విప్లవ అజెండాను అమలు పరచేందుకు అనివార్యంగా ఒక పెద్ద స్థాయి అంచెలంచెల వ్యవస్థ అయిన బ్యూరాక్రటిక్ పాలనా యంత్రాంగం పై ఆధారపడే స్థితికి నెట్టివేయబడ్డాయి. ఈ సోషలిస్టు దేశాల నాయకులు శ్రామిక ప్రజల మనోభీష్టాలను తమకు తామే స్వయంగా ప్రత్యక్షంగా, తెలుసుకొనే అవకాశం లేకుండా పోయింది. దీని వలన ఆ నాయకత్వాలు ఆయనా సోషలిస్టు దేశాల రాజధానులలో కూర్చొని నిర్ణయాలు చేసి, ఆ నిర్ణయాల అమలుదలకు బ్యూరాక్రటిక్ పరిపాలనా యంత్రాంగంపై ఆధారపడాల్సి వచ్చింది. ప్రజలతో దినం దినం ప్రత్యక్ష సంబంధాలు నెలకొల్పుకునే అవకాశం లేకపోవటం వలన ఈ నూతన విప్లవ నాయకత్వం కాలక్రమేణా మెజారిటీ ప్రజాభీష్టంతో సంబంధం లేకుండా దూరంగా జరిగిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీని వలన అటువంటి నాయకత్వం చేసే నిర్ణయాలు నికార్సుగా శ్రామిక ప్రజానీకపు మనోగతానికి అనుగుణంగా లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతూ వచ్చింది. ఇక మరోప్రక్కన సోషలిస్టు విప్లవాన్ని సాధించిన ఈ దేశాలలోని బ్యూరాక్రటిక్ పరిపానా యంత్రాంగాలు స్థిరపడి, ఘనీభవించి విప్లవ వ్యతిరేకంగా మారాయి. ఈ నేపథ్యంలోనే శ్రామిక వర్గ రాజ్యాలలో సైతం నిరంత ప్రజాందోళన లేకుండా (చైనాలో సాంస్కృతిక విప్లవం వంటివి), అప్రమత్తత లేకుండా రాజ్యాంగ యంత్రాన్ని, ఉన్నత స్థాయిలోని విప్లవ నాయకత్వంలోని కొందరిని విప్లవ మనస్థితికి దూరం కాకుండా కాపాడుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో భాగంగానే సోషలిస్టు విప్లవాలు జరిగిన ప్రతిదేశంలోనూ ఆయా దేశాల పరిపాలనా యంత్రాంగం, ఉన్నతస్థాయి విప్లవ నాయకత్వంలో యధాతథ వాదులకూ, సిద్ధాంత నిబద్ధ కోల్పోయిన "ఆచరణాత్మకవాదులకూ" - విప్లవ స్ఫూర్తిని అంచలంచెలుగా కాపాడుకోవాలనుకొనే నిరంతరం సజీవంగా వున్న శ్రేణులకూ మధ్య ఘర్షణ జరుగుతూ వచ్చింది. అయితే మానవ సహజ స్వభావం దృష్ట్యా శ్రామిక వర్గ స్వభావం వున్న వారు సైతం ఏదో ఒక దశలో డస్సిపోయి ఏమరుపాటుకు లోనుకాక తప్పదు. లేక రంగం నుంచి తెరమరుగుకాక తప్పదు. అంటే నిరంతరం చలన శీలతను, అప్రమత్తతను కోరుకొనే నాయకత్వం ఏదో ఒక రోజున స్థిరత్వం పేరుతో ప్రజలకు దూరమయ్యే, రొటీన్ పద్ధతులకు అలవాటు పడిపోయే వారి ముందు ఓడిపోక తప్పదు. ఈ కారణం చేతనే పలుదేశాల సోషలిస్టు విప్లవాలు నూతన సంస్కృతితో కూడిన శ్రామిక రాజ్యాలను ఏర్పరచటంలో విఫలం అయ్యాయి. శ్రామిక ప్రజానీకానికి పరిమిత ప్రయోజనాల రూపంలో లబ్ధిని చేకూర్చి పెట్టగల సోషల్ డెమోక్రటిక్ సంస్కరణ వాదుల పరిపాలనా రూపాలుగా మాత్రమే ఈ విప్లవాల అంతిమ ఫలితం వుంటూ వచ్చింది.

దీనంతటి సారాంశం ప్రపంచంలో నేటి వరకూ జరిగిన పలు సోషలిస్టు విప్లవాలలో వస్తుగత సన్నివేశం విప్లవ లక్ష్యాల సాధనకు అవసరమైన స్థాయికి ఎదగలేదు అనేది. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని శ్రామిక వర్గ రాజ్యరూపంలో వాస్తవీకరించేందుకుగాను ఆయా విప్లవాల నాయకత్వాలు - శ్రామిక ప్రజలకూ మధ్య నిరంతర ప్రత్యక్ష సంబంధం అవసరం. అయితే నిన్నా మొన్నటి వరకూ ఈ ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పుకునేందుకు అవసరమైన సమాచార సాంకేతిక వ్యవస్థ లేదు. బ్యూరాక్రటిక్ పాలనా యంత్రాంగాన్ని అధిగమించి నూతన శ్రామిక వర్గ పాలనా యంత్రాంగాన్ని ఏర్పరచుకోగల భౌతిక పరిస్థితులు లేవు. ఉదాహరణకు సమాచార సాంకేతిక పరిజ్ఞానం తాలూకు ఒకానొక తరహా ఉత్పాదక శక్తుల అభివృద్ధి అనేది కేవలం రెండు దశాబ్దాల క్రితం మాత్రమే నిజ రూపం దాల్చింది. కంప్యూటర్ల రూపంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఈ మధ్యనే రంగ ప్రవేశం చేసింది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సుదూర ప్రాంతాలలో వున్న వారు కూడా కనురెప్పపాటులో సమాచారాన్ని మార్పిడి చేసుకోగల పరిస్థితి వచ్చింది. దీనివలన వివిధ దేశాలలోను, ప్రపంచంలోను వున్న భౌగోళిక దూరాలు, ఆటంకాలను సమాచార మార్పిడిని అధిగమించటం సాధ్యం అయ్యింది. అంటే నేడు విప్లవకర పాలకులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరచుకోగల భౌతిక సన్నివేశం ఏర్పడింది.

అయితే ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానపు ప్రజాస్వామీకరణ సామర్థ్యానికి - దాని ఆచరణాత్మక అమలుకు మధ్య పెట్టుబడిదారీ వర్గ సమాజంలో అగాధం, పరిమితులు ఉండే తీరుతాయి. పెట్టుబడిదారీ దోపిడీ వర్గం తన స్వీయ సంకుచిత వర్గ ప్రయోజనాల దృష్ట్యా అనివార్యంగా ఈ సాంకేతిక పరిజ్ఞానపు ప్రజాస్వామీకరణ సామర్థ్యంపై పరిమితులను వుంచుతూనే వుంటుంది. ఆ కారణం చేతనే దోపిడీ వర్గ పాలకులు బ్యూరాక్రటిక్ పరిపాలనా యంత్రాంగపు పని తీరును కేవలం మరింత "సమర్థ

వంతం", వేగవంతం చేసే పరిమితుల మేరకు మాత్రమే ఈ సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని కుదించి వుంచుతున్నారు. అత్యున్నత స్థాయి చట్ట సభలు ప్రజలకు జవాబు దారీతనం వహించే పరిస్థితి వరకూ సమాచార, సాంకేతిక పరిజ్ఞానపు విస్తృతిని, స్థాయిని పెంచలేకపోతున్నారు. జవాబు దారీతనం పేరుతో ఏర్పరుస్తున్న, నిర్మిస్తొన్న ఇ-గవర్నెన్స్ వ్యవస్థను మెజారిటీ శ్రామిక ప్రజనీకపు ఆకాంక్షలను, నెరవేర్చలేక పోతున్నాయి. అంతేకాకుండా పలు వెనుకబడిన దేశాల దోపిడీ వ్యవస్థల పరిమితులలో తప్పనిసరిగా వుండే నిరక్షరాస్యత వంటి సమస్యలు శ్రామిక ప్రజలను ఈ అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానపు ఫలితాలు, ప్రయోజనాల పరిధికి ఆవలనే వుంచుతున్నాయి. దోపిడీ వర్గ ప్రయోజనాలను అమలు జరిపేందుకూ, అప్రయోజనాలను కాపాడేందుకు ఏర్పడిన పెట్టుబడిదారీ రాజ్యవ్యవస్థ అయిన బ్యూరాక్రసీ వున్నంతవరకూ నిజమైన ప్రజాస్వామ్యం ఏర్పడటం కల్ల. ఏ సాంకేతిక పరిజ్ఞానం అయినా ఇటువంటి వ్యవస్థలో పాలక వర్గపు ప్రైవేటు ఆస్తి ప్రయోజనాలకు మాత్రమే లోబడి ఉపయోగపడగలదు. పని చేయగలదు. దోపిడీని మరింత ముమ్మరం, మరింత ప్రగాఢం చేయడం మాత్రమే దోపిడీ వ్యవస్థ పరిమితులలో ఏ సాంకేతిక పరిజ్ఞానం అయినా సాధించగలదు. అంటే అది వర్గ వైరుధ్యాలను, ఘర్షణలను మరింత తీవ్రతరం, ప్రగాఢం మాత్రమే చేయగలదు.

ఉత్పాదక శక్తుల ప్రస్తుత అభివృద్ధి దశలో నిజమైన శ్రామిక వర్గ రాజ్యాన్ని స్థాపించగల భౌతిక సన్నివేశం నేడు వాస్తవరూపం ధరించింది. గత కాలపు సోషలిస్టు విప్లవాలలో వలెకాక నేటి పరిపక్వ పరిస్థితులలోని సోషలిస్టు విప్లవ నాయకత్వం ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరచుకోగల సన్నివేశం ఏర్పడింది. పెట్టుబడిదారీ బ్యూరాక్రటిక్ తరహా పరిపాలనా యంత్రాంగం స్థానంలో ప్రజా జీవితంలో అంతర్భాగమై ప్రజాభీష్టం మేరకు పనిచేయగల నూతన రాజ్యాంగ వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన పరిస్థితులు నేడు ఏర్పడ్డాయి. ఈ అవకాశం తాలూకు మచ్చుతునకలే కంప్యూటర్‌లు, ఇంటర్‌నెట్, ఇ-మెయిల్ వంటివి. వాటిని ఉపయోగించి నిరంతరం ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కలిగి వుండటం, ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం) వంటి వాటి ద్వారా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే సామాజిక - రాజకీయ - ఆర్థిక నిర్ణయాన్ని తీసుకొనే అవకాశం, అనుకూలత నేడు సోషలిస్టు విప్లవ నాయకత్వానికి వుంది. కాగా, ఈ వస్తుగత సన్నివేశంలో సోషలిస్టు విప్లవ నాయకత్వాల ముందు వుండే సమస్యలు నిరక్షరాస్యత, డిజిటల్ డివైడ్‌గా పేర్కొనబడే అంశం అయిన కంప్యూటర్లను వాడుకోవడం ఎలాగో తెలియని మరోరకం నిరక్షరాస్యత వంటివి. కాగా సాధారణ నిరక్షరాస్యతా పరిష్కారంలో గతంలో జరిగిన రష్యా విప్లవం వంటివి సాధించిన విజయాలు ఇటువంటి సమస్యను పరిష్కరించటం సోషలిస్టు విప్లవాలకు సుసాధ్యమేనని సుదీర్ఘకాలం క్రితమే నిరూపించాయి. ఇక నూతన సమాచార సాంకేతిక పరిజ్ఞానపు దశలో పుట్టుకు వచ్చిన డిజిటల్ డివైడ్ వంటివాటిని పరిష్కరించటం, ప్రజల విజ్ఞాన స్థాయిని పెంచటం పాలక వర్గంగా ఏర్పడిన శ్రామిక వర్గానికి, దాని నాయకత్వానికి పెద్ద సమస్యేమీ కాబోదు. అంటే, ఇటువంటి సమస్యలు కేవలం దోపిడీ వ్యవస్థ పరిమితులలోనే అధిగమించి వీలుకానివి గానూ, పరిష్కారం సాధ్యం కానివి గానూ కనబడతాయి. మించి దోపిడీ వ్యవస్థలో పాలక వర్గానికి ప్రజల చైతన్యం స్థాయి ఒక పరిమితిని మించి పెరగడం రుచించదు గనుక ఇటువంటి సమస్యలు అపరిష్కృతంగా మాత్రమే వదలి వేయబడతాయి. లేదా ఉద్దేశ్యపూర్వకంగా యథాతథస్థాయిలో అణచివేసి వుంచబడుతాయి. దీనంతటితో పాటుగా నూతన సాంకేతిక పరిజ్ఞానపు వినియోగం ఉద్దేశ్యపూర్వకంగానే పెడత్రోవలలోకి మాత్రమే ప్రోత్సహించబడుతుంది.

పైన పేర్కొన్న మొత్తం నేపథ్యంలో గతంలో జరిగిన సోషలిస్టు విప్లవాల పాక్షిక విజయాలకూ, అసంపూర్ణ అజెండా అమలుకూ, పతనానికీ కారణాలను చూసాం. ఈ పరిస్థితి అంతటికీ కారణమైన వస్తుగత సన్నివేశం తాలూకు (ఉత్పాదక శక్తుల అభివృద్ధి) పరిస్థితులను నేడు అధిగమించగల అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ నూతన పరిస్థితిలో "ప్రపంచీకరించబడిన" పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలోనే నూతన శ్రామిక వర్గ రాజ్యం, రాజ్యాంగ వ్యవస్థా సాధనకు అవసరమైన భౌతిక పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి ముందు కాలంలో జరిగే సోషలిస్టు విప్లవాలు శ్రామిక ప్రజల అజెండాను సర్వ సంపూర్ణంగా అమలు జరపగలిగేందుకు నేడు పరిస్థితులు పరిపక్వం అయ్యాయి. ఈ పరిస్థితులకు మార్గం సుగమం చేసేవిగా ఇంటర్‌నెట్‌లు, ఇ-మెయిల్‌లు, చాట్‌రూమ్‌లు, అభివృద్ధి చెందిన టెలికమ్యూనికేషన్ సదుపాయాలు, రవాణా సదుపాయాల వంటివి వుండగలవు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా కంప్యూటర్ల సహాయంతో వివిధ అంశాలపై యావన్మంది శ్రామిక ప్రజల ఓటింగ్‌ను, అభిప్రాయాన్ని క్షణాలలో సోషలిస్టు విప్లవనాయకులు తెలుసుకోగల, సేకరించుకోగల అనుకూల

పరిస్థితి, అవకాశం నేడు మనముందు వున్నది. తద్వారా నిరంతరం చలన శీలవైన, సజీవమైన సోషలిస్టు నాయకత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రజలు ఏర్పరచుకోగలరు. నిజమైన సోషలిస్టు ప్రజాస్వామ్యం వెల్లి విరియగలదు. రాజ్యాంగ యంత్రం, నాయకత్వాలు ప్రజలకు దూరంగా జరిగిపోయే పరిస్థితి నుంచి భవిష్యత్ సోషలిస్టు విప్లవాలను కాపాడుకోగలం. ప్రజలకూ పాలకులకూ మధ్య నున్న సంబంధాన్ని పాత దోపిడీ వ్యవస్థల తాలూకు విభజనలూ, పెత్తందారీ తనం నుంచి విముక్తి చేయవచ్చు. విప్లవ నాయకత్వాన్ని ప్రజలకు ఆజ్ఞలు జారీ చేసే దుస్థితినుంచి బయట పడేసి, ఆ నాయకత్వాన్ని కేవలం ప్రజాభిప్రాయపు సమన్వయ కర్తగానే వుంచగల అనుకూల పరిస్థితులు వుంటాయి. అంతేకాకుండా స్వచ్ఛందంగా సంఘటిత పడిన శ్రామిక ప్రజలు తమను తామే పరిపాలించుకోవడం ఆచరణలో నిజం కావటానికి నేటి భౌతిక పరిస్థితులు మార్గాన్ని సుగమం చేయగలవు. కాబట్టి నేడు కమ్యూనిజానికి కాలం చెల్లిందని ప్రవచిస్తున్న దోపిడీ వర్గ నేతలూ, మేధావులూ అనివార్యంగా గుర్తించి తీరవల్సిన వాస్తవం. కమ్యూనిజానికి నేడు కాలం చెల్లటం కాదు. వాస్తవానికి కమ్యూనిజానికి, ఇంకా సరిగ్గా చెప్పాలంటే దాని ముందు దశ అయిన సోషలిజానికి పరిస్థితులు కలసి వస్తున్నాయి. తాను సృష్టించిన నూతన ఉత్పాదక శక్తులను తన వ్యవస్థలో ఇముడ్చుకోలేక, ముందుకు తీసుకుపోలేక ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్య వాద వ్యవస్థ నేడు మరణ వేదనపడుతోంది. ఆ చారిత్రక దశలో "విప్లవాల యుగం మనది, విప్లవిస్తే జయం మనది" అని శ్రామిక ప్రజానీకం ఎలుగెత్తి గోషించటం గతంలో కంటే మరింతగా, సంపూర్ణంగా వాస్తవ పరిస్థితులకు దగ్గరగా వున్న నిజం. ఈ పరిశీలన అంతటి ఉద్దేశ్యం గతంలోని సోషలిస్టు విప్లవాల వైఫల్యాలకు కారణాలను పరిశీలించటం వర్తమానంలో సోషలిస్టు విప్లవానికి సర్వసంపూర్ణంగా అనుకూలంగా వున్న వస్తుగత సన్ని వేశాన్ని వర్గ వైరుధ్యాలను వివరించటమే. ఇది కమ్యూనిస్టు శ్రేణులలో కూడా అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో ఏర్పడిన కాస్తంత వైరాస్యం. పరాజిత మనస్తత్వం నుంచి బయటపడవేసే ఒక చిన్న ప్రయత్నం. సోషలిజం భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించినప్పుడు భవిష్యత్తే సోషలిజం అని కమ్యూనిస్టు నాయకులు పూర్తి మనోస్థైర్యంతో ప్రకటించగలగడానికి కారణంగా వున్న నేటి చారిత్రక పరిస్థితుల తాలూకు నేపథ్యం ఇది. సోషలిజం ఇక ఎంత మాత్రము కలగా మాత్రమే ఉండజాలని, వుండలేని నూతన ఉషస్సులకు తెరలేస్తోన్న నేటి కాలంలో శ్రామిక ప్రజారాజ్యం కోసం మరింత పట్టుదలతో ముందుకు సాగటమే శ్రామిక వర్గ పార్టీల నేటి గురుతర కర్తవ్యం. చరిత్ర నిర్మాతలు ఎవరో, చరిత్ర హీనులు ఎవరో అంతిమంగా తెలిసిపోయే కాలపు అంచులలో నేడు మనం జీవిస్తున్నాం. సోషలిజం సాధనకు భుజం భుజం కలిపి ముందుకు సాగుదాం. పట్టిమాటల మూటలుగానే మిగిలి పోయిన స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సోదర భావాలను నిజం చేద్దాం. సోషలిస్టు విప్లవం వర్ధిల్లుగాక!

□

(అయితే ఈ వ్యాసంలో పేర్కొన్న వాదన ఉద్దేశ్యం కేవలం ఉత్పత్తి శక్తుల అభివృద్ధి పూర్తయిపోవడంతోనే సోషలిజం క్ష దాని అనంతరం కమ్యూనిజం ఏర్పడతాయనికాదు. సోషలిస్టు పరివర్తన దశలో అనివార్యంగా అన్యవర్గ ధోరణులపై శ్రామికవర్గం నిరంతర పోరాటం జరపవలసి వుంటుంది. అప్రమత్తత చూపవలసి ఉంటుంది. కాగా, ఈ విషయంలో కమ్యూనిస్టు శ్రేణులు, నాయకత్వం, మేధావులలో ఇప్పటికీ సుదీర్ఘ చర్చ జరిగింది. ఇఅంకా జరుగుతోంది. అందుచేత సోషలిజం నిర్మాణంలో శ్రామికవర్గం, దాని ఆలోచనల పాత్రను మినహాయించడం, లేదా కుదించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. సోషలిస్టు నిర్మాణం తాలూకు మరో పార్శ్వాన్ని తడమడమే వ్యాసకర్తగా నా లక్ష్యం.

- పాపారావు)

(ఈ వ్యాసంపై చర్చను ఆహ్వానిస్తున్నాం - సంపాదకులు)

అడ్డం పెట్టుకుని, మత శక్తులను సంతుష్టి పరచడం ద్వారా మత ఛాందసత్వాన్ని అడ్డుకోగలమని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లయితే అంతకంటే పొరపాటు చర్య మరొకటి ఉండబోదు. అయితే త్రిశూల దీక్షను నిరోధించడంలో గానీ లేక చట్టరీత్యా నిషేధించడంలో కొన్ని ఇబ్బందులున్నమాట నిజం. ఈ దీక్షను విశ్వహిందూ పరిషత్తు ఒక మత చిహ్నంగా పరిగణిస్తూ, దాన్ని నిషేధాన్ని మత విరుద్ధ చర్యగా ప్రజలకు చెబుతూ తద్వారా లబ్ధి పొందాలని చూస్తుంది. ఈ పరిస్థితుల్లో నిషేధించినా దాని ప్రాబల్యం పెరుగుతుంది. ఒకవేళ నిషేధించకుంటే, మన రాజ్యాంగం ప్రసాదిస్తున్న ప్రజాస్వామిక హక్కుల సౌకర్యాన్ని వినియోగించుకుంటూ దీక్షల ద్వారా తన ప్రాబల్యాన్ని పెంచుకుంటుంది. ఈ క్లిష్ట పరిస్థితిని నేర్పుతోనూ, పటిష్టంగానూ ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. దీనికి చట్టబద్ధ పరిపాలన మార్గం సరైందని తోస్తుంది.

□

అభివృద్ధి ముసుగులో జరుగుతున్నది ఏమిటి?

- వి.హనుమంతరావు

'అభివృద్ధి, మౌలిక సౌకర్యాల అభివృద్ధి' మన పాలకులకు రామనామ జపమైపోయింది. మన పాలకుల గురువుకు గురువైన ప్రపంచ బ్యాంకు, వాళ్ల తలలో ఈ నినాదాన్ని ప్రవేశపెట్టింది. మన దేశమంటే, ముఖ్యంగా మనరాష్ట్రమంటే ప్రపంచ బ్యాంకుకు ఎంత ముద్దో. మనదేశం అభివృద్ధి అంటే అది మనకు సంబంధించిన అభివృద్ధి గురించి బాంకు కలలు ఎందుకు కంటుందోమరి. సరే ఆ ప్రశ్న కాస్త పక్కన పెట్టి కొన్ని ప్రాథమిక ప్రశ్నలు వేయాలనిపిస్తుంది.

1. అభివృద్ధి అంటే ఏమిటి
2. అభివృద్ధి స్వభావాన్ని ఎవరు నిర్ణయించాలి?
3. మౌలిక వనరులంటే ఏమిటి?
4. మౌలిక వనరుల అభివృద్ధి పేరుతో జరుగుతున్నదేమిటి
5. ఎవరి అభివృద్ధి?

అభివృద్ధి అంటే ఏమిటి?

'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నారు మహాకవి గురజాడ. దేశాభివృద్ధి అంటే ఆ దేశ ప్రజల ప్రమాణాలను, వారి సామాజికార్థిక ప్రమాణాలను పెంచడం, ప్రపంచ బ్యాంకు నేర్పిన మంత్రాన్ని పాలకులు జపిస్తున్నారేగాని అభివృద్ధి అంటే ఏమిటి, ఏ దిశగా అభివృద్ధి జరగాలి అనేదేమిటో నిర్వచించలేదు. ప్రజల సామాజికార్థిక అభివృద్ధి గురించి ప్రస్తావనే లేదు. సామాన్య ప్రజల, ముఖ్యంగా పేదరికపు రేఖకింద నివసించే ప్రజల జీవనస్థాయి పెంపుదల ఊసేలేదు.

మనరాష్ట్ర పాలకులు గోడలకు సున్నాలు వేసి, పాఠశాలలకు, ఆస్పత్రులకు నాలుగు భవనాలు కట్టించి, ఓ అరడజను ఫ్లైఓవర్లు నిర్మించి ఇదాంతా అభివృద్ధి అంటున్నారు. అభివృద్ధిఅంటే ఏమిటో నిర్వచించకుండా, ఈ పనులనే అభివృద్ధిగా చిత్రిస్తున్నారంటే మన పాలకులకు ప్రపంచ బ్యాంకు అభివృద్ధి అంటే ఏం చెప్పిందో అర్థమైనా కాకపోయి ఉండాలి, లేదా కావాలనే ప్రజలను పక్కదారైనా పట్టిస్తుండాలి. అభివృద్ధి పేరుతో చంద్రబాబు ఏం పనులు చేస్తున్నారో, అవన్నీ ప్రపంచ బ్యాంకు దృష్టిలో ఆర్థిక పునర్నిర్మాణ పథకంలో కార్యక్రమాలే గాని అభివృద్ధి కార్యక్రమాలు కాదు. ప్రపంచబ్యాంకు 'అభివృద్ధి నివేదిక- 2000'లో అభివృద్ధి అంటే ఏమిటో ఏం నిర్వచించిందో చూడండి.

"పెరుగుదల అంటే బొట్లు బొట్లుగా అభివృద్ధి ప్రజలకు చేరడం కాదు. ప్రజల అవసరాలను నేరుగా సాధించాలి. ఏ ఒక్క విధానం తనంతట తానే సాధించ జాలదు. సమగ్రవైఖరి నవలంబించాలి. ఆహార భద్రత, నీటికొరత తీర్చడం, వయసు మళ్లిన వారికి భద్రత, సాంస్కృతిక సంరక్షణ, పర్యావరణ దిగజారుడును నిరోధించడం - వీటన్నిటినీ సాధించగలగాలి. ఈ సమస్యలన్నిటి పరిష్కారమే అభివృద్ధికి, మానవ సంక్షేమానికి దోహదం చేస్తుంది. ఉదాహరణకు పాఠశాల భవన నిర్మాణమే తీసుకుంటే, అలాంటి నిర్మాణం ప్రారంభం మాత్రమే, విద్యాస్థాయి పెంపుదల అనేక విషయాల మీద ఆధారపడుతుంది. ఉపాధ్యాయులకు శిక్షణ, వారి ఎంపిక తగిన జీతభత్యాలు, పుస్తకాల సరఫరా, ఇతర అవసరాలు చేకూర్చడం కూడా భవన నిర్మాణం అంత అవసరం."

పాలకులు అభివృద్ధి గురించి మాట్లాడే టప్పుడు మౌలికావసరాల గురించే కాని, ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి గురించి ఆలోచన వారి మనస్సులో లేదు. పోనీ, ఆ మౌలికావసరాలేమిటో నిర్వచించారా అంటే అదీలేదు. ప్రపంచ బ్యాంకుకు వారి తలలు తాకట్టు పెట్టేశారు కాబట్టి బ్యాంకు ఆలోచనలే పాలకుల ఆలోచనలు. పాము కుట్టినా, తేలు కుట్టినా ఒకే మంత్రం అన్నట్లు, ఆ బ్యాంకు రుణ సహాయం తీసుకున్న దేశాలన్నింటికీ ఒకటే సూత్రం, ఒకటే నిర్వచనం.

అభివృద్ధి గురించిన ప్రపంచబ్యాంకు వివరణ ఇది. కాని మనం చూస్తున్నదేమిటంటే పాఠశాల భవనం నిర్మించి అదే అభివృద్ధి అంటున్నారు అమాత్యగణం.

అభివృద్ధి స్వభావాన్ని ఎవరు నిర్ణయించాలి?

అభివృద్ధి స్వభావం, ఏయే రంగాల్లో ఏదిశగా పయనిం

చాలి అనే విషయాలను నిర్ణయించాల్సింది ప్రజలు, ఆ పనులను అడిగి చేయించుకునే ప్రాథమిక హక్కును ప్రజలకు రాజ్యాంగం కల్పించింది. ప్రజల అవసరాలేమిటో వారిని అడక్కుండా, వారి కేమి కావాలో వారికే తెలియదని పాలకులు వారికి వారే అనుకుని, ప్రజలకు ఏది మంచిదో తామే నిర్ణయించడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. అది రాచరిక వ్యవస్థ ఆలోచన, పద్ధతి , ప్రజాస్వామ్యం ముసుగులో రాచరికాన్ని కొనసాగించడాన్ని బొడ్డులో వేలుపెట్టి నిలబెట్టి అడగలేకపోవడం విచారకరం. ప్రజలకు కావల్సిన అవసరాలను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తెలుసుకుని దానికనుగుణంగా అభివృద్ధి ప్రణాళికను తయారుచేసేలా పాలకులను నిలదీసి, ప్రజలే వారి రాజ్యాంగ హక్కును వినియోగించుకోవడం అవసరం.

మౌలికావసరాలంటే ఏమిటి?

పాలకులు అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు మౌలికావసరాల గురించే కాని, ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి గురించి ఆలోచన వారి మనస్సుల్లో లేదు. పోనీ, ఆ మౌలికావసరాలేమిటో, సౌకర్యాలంటే ఏమిటో నిర్వచించారా అంటే అదీలేదు. ప్రపంచ బ్యాంకుకు వారి తలకాయలు తాకట్టు పెట్టేశారు కాబట్టి బ్యాంకు ఆలోచనలే పాలకుల ఆలోచనలు. బ్యాంకుకు పడికట్టు నిర్వచనం ఉంది. పాము కుట్టినా, తేలు కుట్టినా ఒకే మంత్రం అన్నట్టు, ఆ బ్యాంకు రుణసహాయం తీసుకున్న దేశాలన్నింటికీ ఒకటే సూత్రం. ఒకటే నిర్వచనం. దాని ప్రకారం 1.రహదారులు, 2.నీటిపారుదల, 3.విద్యుచ్ఛక్తి, 4.ఓడరేవులు. ఈ నిర్వచనమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేదం. కేంద్రం 1300కి.మీ. ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మించడానికి నిర్ణయించినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై సౌకర్యాలను అభివృద్ధి చేయాలని. అందుకు ప్రైవేట్ రంగానికి అప్పగించాలని నిర్ణయించినా దానివెనుక ప్రపంచ బ్యాంకు హస్తం ఉంది. అంటే మన రాష్ట్ర అభివృద్ధి ఏ రంగాల్లో జరగాలో, ఎలాజరగాలో, ఎవరు ఆ పని చేయాలో ప్రపంచ బ్యాంకే నిర్ణయిస్తుంది. మన పాలకులు వట్టి వేలిముద్రరాయుళ్లు. దేశ, రాష్ట్ర స్వయంసహాయాధికారం అనే మాటకు అర్థమే లేకుండా పోయింది. ఇది ప్రపంచ బ్యాంకు, దాని కనుసన్నలలో మెలిగే పాలకుల నిర్వచనమైతే, దేశంలోని అత్యధిక సంఖ్యాక ప్రజల నిర్వచనం మరోరకంగా ఉంది. అది-

1. ఆహారం, 2.గృహనిర్మాణం, 3.వస్త్రాలు, 4.పరిశుభ్రత, 5.తాగే రక్షిత నీరు, 6.ఉపాధి, ఉద్యోగావకాశాలు.

ప్రతి పౌరుడి జీవితావసరాలు తీరడానికి కావాల్సిన మౌలిక సౌకర్యాలివి. ఇవన్నీ లభించిననాడు వారే దేశాన్ని అభివృద్ధి చేస్తారు. చేయగలుగుతారు. అలాంటి అవసరాలు తీరిన నాడే అది నాగరిక సమాజమవుతుంది.

మౌలిక సౌకర్యాల అభివృద్ధి పేరుతో జరుగుతున్న దేమిటి?

మనదేశంలోకి రావడానికి, బయటకు పోవడానికి (విమానాశ్రయాలు, ఓడరేవులు). ప్రధాన రహదారులు, వ్యవసాయానికి అవసరమైన కాలువలు అన్నీ ప్రైవేట్ రంగానికి ధారాదత్తమవుతాయి. అందులోనూ బహుళజాతి సంస్థల పరమవుతాయి. వాళ్లకు కోపం వస్తే, లేదా వారు చెప్పిన మాట వినకపోతే అష్టదిగ్బంధనం చేయగలరు. ఎంత భయంకరమైన పరిస్థితి!

ఇదేం పోయేకాలం వచ్చిందయ్యా అని ప్రభుత్వాన్ని అడిగితే, ఏం చెయ్యం, మా వద్ద డబ్బు లేదంటుంది.

డబ్బులేదా? ఎవరైనా నవ్వుతారు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అని అనుకుంటే చెప్పలేంగాని, స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న ధనమంతా (ఈ ఎక్కౌంట్లున్న వారిలో మహానాయకులు, మంత్రులు, అధికారులున్నారు. ప్రపంచ బ్యాంకు పేర్కొనగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఉదహరించిన మొత్తం 850 కోట్ల డాలర్లు). ఈ దేశ ప్రజలు సృష్టించిన ధనంకాదూ? విదేశాలకు పోయి, అక్కడ హోటళ్ళు నిర్మించినది ఈ దేశం ధనంతోకాదూ? ఇటీవల ఐ.ఎ.ఎస్. అధికారుల లిస్టు ఒకటి వితల్ ప్రచురించారు. వారు అడ్డదారులు తొక్కారన్న ఆరోపణ నిజమైతే, వారి సంపాదన అంతా ఈ దేశ ప్రజలు సృష్టించిన సంపదకాదూ? ఎన్నికల్లో ఖర్చు పెట్టే కోట్ల రూపాయలు ఎక్కడినుండి వచ్చాయి? ప్రభుత్వ ఖర్చు తగ్గించుకుంటే, విదేశాల పర్యటన, మంత్రుల విలాస భవనాలు, రాష్ట్రపతి, గవర్నర్ల విలాస భవనాలమీద అనవసర ఖర్చు - ఇలా నిధుల గురించి చెప్పాలంటే పెద్దాపురం చాంతాడంత పట్టిక తయారు చేయవచ్చు.

ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. సూచనల మేరకు ప్రాధాన్యత లేని రంగాలకు రుణం తీసుకుని ఖర్చు చేయడం, వడ్డీల భారం పెరగడం, ప్రజలు పన్ను రూపంలో చెల్లించిన ధనాన్ని

వడ్డీల పేరుతో చెల్లించడం, రుణాల ఊబిలో కూరుకుపోయి, ఆ భారాన్ని పన్నుల రూపంలో ప్రజలపై రుద్దడం పాలకులకు దశాబ్దాలుగా నిత్యకృత్యమైపోయింది.

ఎవరికోసం?

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎవరి అభివృద్ధికోసం అనేది ముఖ్యమైన ప్రశ్న.

రోడ్లు వెడల్పు చేయడం, ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలు, ప్రజల కనీసావసరాలు తీర్చుతాయా? లేక కాంట్రాక్టర్లు, ప్రపంచ బ్యాంకు కన్సల్టెంట్లు, ప్రభుత్వోద్యోగులు, రాజకీయ నేతల జేబులు నింపుతాయా? రోడ్ల వెడల్పు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఫ్లైఓవర్లు లేకపోతే ప్రజలు చచ్చిపోతున్నారా? ఎవరి అభివృద్ధికోసం అప్పుల ద్వారా ఈ నిర్మాణాలు? దీనికి సమాధానం ఊహించడం కష్టంకాదు.

2. విద్యుచ్ఛక్తి ఛార్జీలు పెంచి, ప్రైవేటీకరిస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందా? విమానాశ్రయాలు, ఓడరేవులు ప్రైవేటీకరిస్తే దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారి ఆకలి తీరుతుందా?

3. కాలువలను ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తే చిన్న, సన్నకారు రైతులకు సహాయం అందుతుందా? ఎవరికోసం ఈ అభివృద్ధి? కోట్ల జనాభా ఆకలి వీటి అభివృద్ధి ద్వారా తీరుతుందా? మనదేశ మౌలిక వనరులేమిటో నిర్వచించే అధికారం ప్రపంచ బ్యాంకుకు ఎవరిచ్చారని ప్రశ్నించే హక్కు ప్రజలందరికీ ఉంది.

4. స్వాతంత్ర్యం వచ్చి యాభై ఐదు సంవత్సరాలు గడుస్తున్నా 40 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన ఉన్నారు. ఇంకా చాలామంది ఉండడానికి ఇల్లు, కట్టుకోడానికి బట్టలు లేకుండా ఉన్నారు. అలాంటి నేపథ్యంలో నగరాలను అందంగా అలంకరించడం, ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మించడం, రహదారులు వెడల్పు చేయడం ప్రభుత్వానికి ప్రాధాన్యతారంగాలై పోయాయా? దీని కోసం ప్రపంచ బ్యాంకునుంచి రుణాలు తీసుకురావడమా?

ప్రజలు కేవలం వోటర్లు కాదు. వీరికీ పాలనార్హత ఉంది. ఎన్నికైన వారు ప్రజల సేవకులు. తమ ప్రాథమికావసరాలు తీర్చమని, దాని కేటాయింపులకీ ప్రాధాన్యత ఇవ్వాలని అడిగే హక్కు ప్రజలకే ఉంది. వారికి ఎలక్ట్రానిక్ ప్రభుత్వం ప్రాధాన్యత కాదు. కూడు, గుడ్డ, గూడు, బ్రతికే హక్కు, అది కూడా గౌరవప్రదంగా జీవించే హక్కు, కనీసావసరాలు అందించాలని కోరే హక్కు రాజ్యాంగం వారికిచ్చింది. రహదారులు, ఫ్లై ఓవర్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మించండి. కాని ముందు ప్రాథమికావసరాలు ముఖ్యంగా గ్రామీణ ప్రజల జీవితాలు బాగుచేయండి.

ప్రభుత్వాన్ని శాసించే హక్కు ఈ ప్రజలది. ప్రపంచబ్యాంకుది కాదు అని ప్రజలు ఎలుగెత్తి చాటాలి.

(పీపుల్ ఫర్ ఎకనామికల్ అండ్ ఎఫెక్టివ్ మెడికేర్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పి.వి. భాస్కరరావు వ్యాసం ఆధారంగా) ☐

(12వ పేజీ తరువాయి)

ఏ చట్టప్రకారం సమర్థనీయం కాదు. కనీసం యుద్ధసమయాల్లో కూడా ఇది నేరమే. అలా ఎత్తుకుపోయినవారిపై చర్యతీసుకుని కఠినంగా శిక్షించకపోతే పౌరులకు రక్షణ లేకుండా పోతుంది.

*. ఇలా బలవంతంగా మాయం చేసిన అన్నికేసుల్నీ క్షుణ్ణంగా విచారించి న్యాయం చేసేందుకు (కొన్ని ఇతర దేశాల్లో వలె) కమిషన్‌ను నియమించాలి. 1989నుంచి జమ్ముకాశ్మీరులో ఇందుకు బాధ్యులైన ప్రభుత్వ, ప్రభుత్వేతర వర్గాలపై చర్యతీసుకోవాలి.

*. అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం మాయమైనవారి సమీప బంధువులకు, తలిదండ్రులకు రక్షణ కల్పించాలి, తగిన న్యాయం చెయ్యాలి.

ఈ డిమాండ్లు నెరవేరేవరకూ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.

(ఇ. పి. డబ్ల్యు సౌజన్యంతో)

అనువాదం-డా.మానెపల్లి

రిజర్వుబ్యాంకు వడ్డీరేటు తగ్గింపు నిర్ణయం మధ్యతరగతి ప్రజల, అలాగే వృద్ధుల ప్రాణాలకు వచ్చిన సంకటమే, కాని ప్రభుత్వానికి, కంపెనీలకు మాత్రం అది అనుకోని వారంలా వచ్చి పడింది. కంపెనీలు వడ్డీ చెల్లింపులకు వాళ్ల బడ్జెట్లలో కేటాయింపులు చేస్తాయి. వడ్డీరేటు తగ్గటం వలన, వడ్డీ చెల్లింపు ఖర్చు తగ్గుతుంది. ఎకనామిక్ టైమ్స్ వార్తా పత్రిక ఓ వంద కంపెనీలను సర్వే చేయగా, 02-03లో వడ్డి ఖర్చు 11.1 శాతానికి తగ్గిందని గమనించింది. 01-02తో పోలిస్తే, ఆ కంపెనీలకు వడ్డీ ఖర్చు రు.750 కోట్లు తగ్గింది. అదేకాలంలో వారి మొత్తం లాభాలు రు.1746 కోట్లు పెరిగాయని తేల్చింది. వడ్డీరేటు తగ్గించటం వల్ల, అంతకుముందు హెచ్చు వడ్డీరేట్లకు తీసుకున్న రుణాల్ని తిరిగి చెల్లించేసి, తక్కువ వడ్డీ రుణాలు తెచ్చుకోవటం వల్ల వారి ఆదాయాలు పెరిగాయి. అంతేకాదు. కొంతమందయితే, తెచ్చుకొన్న రుణాలను చెల్లించి వేసి ఇటు రుణభారం అటు వడ్డీ భారం తగ్గించుకొన్నారు. ఇలా తీసుకున్న వడ్డీ రేటు తగ్గిస్తూ, రెండో పక్క బాంకుల్లో ఎస్.ఎల్.ఆర్. తగ్గించటం వల్ల రుణాలివ్వడానికి బాంకుల వద్ద అదనపు నిధులు లభించాయి. అంటే బాంకులు కూడా ఎక్కువగా వడ్డీ ఆదాయం సంపాదించుకొంటాయి. ఎటొచ్చీ ఈ నిర్ణయం మధ్యతరగతి కొంప ముంచింది. అటు సహకార బాంకులు బోర్డులు తిప్పేసి అసలుకే మోసం తెచ్చారు. ప్రభుత్వం వడ్డీ రేట్లు తగ్గించి రెండో చెంప వాయించింది. మధ్యతరగతి ప్రజలు మధ్యనే నలిగిపోతున్నారు.

* * *

'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారధోరణులను విద్యారంగంలో చోటు చేసుకోనివ్వను'' మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి మురళి మనోహర్ జోషి సుభాషితం ఇది. ఆంధ్రప్రదేశ్‌లో యువకులు, విద్యార్థులు ఈ ప్రకటన చదివి నవ్వుకుని వుంటారు. వందల ఇంజనీరింగు కాలేజీలు డజన్ల మెడికల్ కాలేజీలు, ఇంకా అనేక ఇతర కాలేజీలు వ్యాపారధోరణి లో.......... రెండు సంవత్సరాల క్రితమే పచ్చజండా ఊపిన జోషీ ప్రియ మిత్రుడు చంద్రబాబు గురించి ఆయనకు తెలియదా అని యువకులు, విద్యార్థులు వారిలో వారే ప్రశ్నించుకొని వుంటారు. ఈ ప్రయివేటు వారి కాలేజిల్లో ఫీజులు ఉదారంగానే 20 వేల రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయిస్తే చాలదు, 28 వేలు నిర్ణయించాలని ప్రయివేటు యాజమాన్యాలు బేరం ఆడుతున్న విషయం జోషీకి తెలియదా? రాష్ట్రం నిండా ఆ చివరనుంచి ఈ చివర వరకూ వందల కొలది ట్యుటోరియల్ కాలేజిలు ప్రయివేటు రంగంలోనే వున్నాయని, లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న విషయం కళ్లు లేని కబోదులకు కూడా తెలుసు. ఇలా చేయడం వల్ల లక్షలాది మంది మధ్యతరగతి పేద కుటుంబాల బిడ్డలు ఉన్నత విద్యనుంచి శాశ్వతంగా దూరం అవుతున్నారు. రేపు ఉద్యోగాలు వస్తేగిస్తే అవి ధనవంతుల బిడ్డలకే దక్కుతాయి. అలాంటి వారు అధికారంలోకి వస్తే పేదలు వారి సమస్యల గురించి గీపెట్టి అరచినా వారికి వినబడదు. కనబడదు. ఇలా పేదలను పల్లకీలెక్కకుండా జీవితాంతం బోయీలుగానే ఉంచే పద్ధతులను అనుసరిస్తూ, రెండో పక్క నేను 'విద్యను వ్యాపారంగా మార్చనివ్వను' అంటూంటే 'విశ్వసనీయతా, నీ ఎడ్రసు ఎక్కడ? అని అడగాల్సి వస్తుంది.

* * *

ఆఫ్ఘనిస్తాన్‌లో బిన్ లాడెన్‌ను, ఇరాక్‌లో సద్దాంను టెర్రరిస్టులుగా ముద్రవేసి, ఆ రెండు దేశాలను తన పాదాక్రాంతం చేసుకొన్నానని అమెరికా పాలకులు తమ రొమ్ము విరుచుకోవచ్చునేమో గాని, తన దేశంలోనే టెర్రరిజం రూపుదిద్దుకుంటోందని, అది పాలకుల అధికారాన్ని బద్దలు కొడుతుందనే విషయాన్ని ప్రపంచ ప్రజల దృష్టి పడకుండా చూడాలని అనుకోవడం అసాధ్యం. ఆకాశాన్ని మూకుడుతో దాచివేయగలమా? ఆ టెర్రరిస్టు ఎవరో కాదు, అమెరికాను ముంచుకు వస్తున్న ఆర్థిక సంక్షోభం. 93-94 మధ్యకాలంలో నిరుద్యోగం 3.9 శాతానికి పడిపోగా, ఇవాళ ఆరు శాతానికి జర్రున దిగజారింది. సగటున పనిగంటలు (వారంలో) పడిపోయాయి. ఓవర్‌టైమ్ పనులు తగ్గాయి. ఫాక్టరీలకు ఆర్డర్లు తగ్గాయి. అంతకన్నా ముఖ్యమైన విషయమేమంటే డాలర్ విశ్వసనీయతను కోల్పోయింది. అమెరికన్ సెక్యూరిటీస్‌లో విదేశీ పెట్టుబడులు 85 శాతం మేరకు తగ్గాయి. దీనితో యూరో, ఎన్‌లతో పోల్చిచూస్తే విలువ పడిపోయింది. బడ్జెట్‌లో 400 బిలియన్ డాలర్లలోటు ఏర్పడింది. ప్రజలు తమ పొదుపును యూరో, ఎన్‌లలో భద్రపరచుకొంటుండంతో డాలరు విలువ 20 శాతం తగ్గింది. ఇదివరకు ప్రతి యూరో (నాణం)కు 6.93 డాలర్ లభిస్తే, ఇప్పుడు 1.12 డాలరే చెల్లిస్తేనే లభిస్తుంది. ఇలా దిగజారి పోతున్న పరిస్థితిని అదుపులోకి తీసుకొని రావడానికి ఇరాక్ మీద ఎవరు చెప్పినా, ససేమిరా వినకుండా, దురాక్రమణకు తెర పడింది. యుద్ధం అంటే అన్నింటికి డిమాండ్ పెరుగుతుంది. ఇదంతా చదివి ఇంకేముంది, అమెరికా ఆర్థక వ్యవస్థ కుప్పకూలి పోతుందని అనుకోవం పొరపాటు అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచంలో ప్రస్తుతానికి పైచేయి సంపాదించిన పరిస్థితుల్ల, ఎటువంటి దుశ్చర్యలకైనా తలపడి, తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. 1930లో మాంద్యం నాటినుండి సంక్షోభాలను ఎదుర్కొంటూనే వుంది. బయటపడుతూనే వుంది. అయితే అది తాత్కాలికమే. □

చేబదుళ్లమీద బతుకుతున్న రాష్ట్రాలు

ఎంత డబ్బున్న వాళ్ళకైనా ఒక్కొక్కప్పుడు అత్యవసరంగా డబ్బు కావాల్సి వస్తుంది. మధ్య తరగతి కుటుంబాల్లో ఇలాంటి అత్యవసరాలు ఎక్కువగానే వస్తూంటాయి. ఎవరివద్దనో చేబదులు తీసుకొని, జీతం రావటంతోనే తీర్చేస్తుంటారు. ఇలాంటి అవసరాలు ప్రభుత్వాలకు కూడా ఏర్పడుతూంటాయి. రిజర్వు బ్యాంకునుంచి చేబదులు తీసుకొని తీర్చేస్తుంటారు. దీనినే ఆర్థిక పరిభాషలో వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ అంటారు. ఈ చేబదులు పరిస్థితిని కూడా మించి డబ్బు అవసరం పడితే, అది ఓవర్‌డ్రాఫ్ట్ అవుతుంది.

మామూలుగా ప్రభుత్వాలు తమ ఆదాయ పరిధిలోనే ఖర్చును నియంత్రించుకోగలగితే, లేదా లభించిన ఆదాయాన్ని పొదుపు చేసుకోగలిగితే రెవెన్యూలో మిగులు ఏర్పడుతుంది. అపుడు ... చేబదుళ్ల అవసరమే వుండదు. ఇటీవలి కాలంలో మన రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఎంతక్లిష్టమైన స్థితికి చేరిందంటే, ప్రభుత్వం పనిచేసిన ప్రతీరోజూ, చేబదుళ్ళతో, ఓవర్ డ్రాఫ్టలతో కాపురం చేయాల్సి వచ్చింది. (ఇటీవల ఓ వార్తాపత్రిక ముఖ్యమంత్రి ఫాస్ట్ మూవింగ్ స్టేట్ అనే అవార్డు పుచ్చుకొని వచ్చారు బహుశా ఇంత ఫాస్ట్‌గా చేబదుళ్ళు, ఓవర్ డ్రాఫ్టలు తీసుకొన్నందుకు ఇంత ఫాస్ట్ అప్పుచేస్తున్నందుకేనేమో). తాజాగా రిజర్వుబ్యాంకు ప్రచురించిన ఏప్రియల్ నెల బులెటిన్‌లో ఈ చేబదుళ్లలో ఓవర్ డ్రాఫ్టల చిట్టా విప్పి, దాని పుట్టు పూర్వోత్తరాలను విశ్లేషించింది.

ఆదాయ వ్యయాల మధ్య పొంతన లేకపోవటం నిన్నా ఇవాళ ఏర్పడిన పరిస్థితి కాదు, లేదా ఇదేమీ కొత్త విషయమూ కాదు. 1937 నుంచి వస్తున్నదే. అయితే కాలం గడిచిన కొద్దీ ఈ పొంతన లేకపోవటం మరీ ఎక్కువవుతూ రావటంతో రాష్ట్రాలకు ఇచ్చే చేబదుళ్ళ పరమితిని పెంచుతూవచ్చింది. 1967, 1972, 1976,1978,1982,1986,1988,1991, 1996 సంవత్సరాల్లో మొత్తం తొమ్మిదిసార్లు ఈ పరిమితిని సవరిస్తూ వచ్చింది. అయినా రాష్ట్రాలు గాడి తప్పుతూనే వచ్చాయి. మార్చి 1999లో రు.2234 కోట్లనుంచి రు.3685 కోట్లకు, ఏప్రిల్ 2000లో రు.6035 కోట్లకు పెంచుతూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకూ ఈ పరిమితిలు ఫిబ్రవరి 1999లో రు.168 కోట్ల నుంచి మార్చి 99లో రు.288 కోట్లకు, ఫిబ్రవరిలో రు.463 కోట్లు, ఏప్రియల్‌లో రు.520 కోట్లకు పెరుగుతూ వచ్చింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత, ఆంధ్రప్రదేశ్‌కే అతి ఎక్కువ పరిమితి లభించింది. పెద్ద రాష్ట్రాల్లో నాలుగో స్థానంలో వుండగా, ఏప్రిల్ 2002 నాటికి మూడోస్థానానికి చేరింది. అంటే అంత ఎక్కువ మేరకు రిజర్వుబ్యాంకు నుంచే చేబదుళ్లు తెచ్చుకోవచ్చునన్నమాట. దానర్థం రాష్ట్రంలో ఆదాయ వ్యయ సమతుల్యత అంత లోపించిందన్నమాట. 1999తో పోలిస్తే ఈ పరిమితి 209 శాతం పెరిగింది. తాజాగా రాష్ట్రానికి సంబంధించినంత వరకూ ఈ పరిమితిని రు.620 కోట్లకు పెంచాలని రిజర్వుబ్యాంకు కమిటి సిఫార్సు చేసింది.

ఓవర్ డ్రాఫ్టలు

చేబదుళ్ల స్థాయి, పరిమితి దాటి రాష్ట్రాలు ఇంకా ఎక్కువ నిధులను బ్యాంకునుంచి తీసుకొంటున్నా, మొదట్లో అవి చాల చిన్న మొత్తాలు, చాలా అరుదుగా తీసుకోవటం జరిగేది. కాని రాను రాను కొన్ని రాష్ట్రాలు 60వ దశకం మధ్యంతర కాలం నుంచి ఓవర్ డ్రాఫ్టలు మొత్తం, సంఖ్య పెరగటం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం అలాంటి సందర్భాల్లో రంగ ప్రవేశం చేసి, ఓవర్ డ్రాఫ్టలను తిరిగి చెల్లించివేయడానికి రాష్ట్రాలకు సహాయపడుతూ వచ్చింది. అపుడు ఇటు రాష్ట్రాల్లో, అటు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో వుండడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రాన్ని బతిమాలో భయపెట్టో సర్దుబాట్లు చేసుకొంటూండేవి. కాని పరిస్థితులు మరింత త్వరితంగా చేయి జారిపోతూండడంతో కేంద్రం తనను తాను రక్షించుకోవాల్సి వచ్చి 'అబ్బాయిలూ, ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోండి. అయితే ఏడు రోజుల్లోగా తీరుమానం చెయ్యాలి. లేకపోతే, రిజర్వుబాంకు మీ చెక్కులు చెల్లించబోదు'' అని హెచ్చరించాల్సి వచ్చింది. ఈ కాలపరిమితి రాను రాను 12 రోజు

లకు పెరిగింది. రాష్ట్రాలు ఊపిరి పీల్చుకున్నాయి. కాని ఈ ధోరణి ఆయా రాష్ట్రాల ఆర్థిక దుస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

ఉద్దేశం - ఆచరణ

అయితే ఈ రెండు పద్ధతుల్లో రిజర్వుబాంకు నుంచి డబ్బు తెచ్చుకోవటం తాత్కాలికంగా చేసుకొన్న ఏర్పాటు. కాని ఇది ఆచరణలో బడ్జెట్‌లో ప్రభుత్వం చూపించే ఆదాయానికి ఇది అదనపు ఆదాయ వనరుగా మారింది. ఇది పూర్తిగా అనారోగ్యకరమైన ద్రవ్య పరిస్థితి. దీనిని కిజర్వు బాంకు హర్షించలేదు. ఎందుకైతే ఈ ఏర్పాటు చేసిందో దానికిది పూర్తి విరుద్ధం. ఆదాయ, వ్యయాల మధ్య సంవత్సరం తర్వాత సంవత్సరం అంతరం పెరిగి పోతుందంటే, ఇదొక వ్యవస్థాగతమైన రుగ్మత. ఈ రుగ్మతను తొలగించడానికి ఇది పరిష్కారం కాదు. 330 రోజుల కన్నా ఎక్కువకాలం చేబదులు తీసుకునే రాష్ట్రాలు 98-99లో రెండే రెండు వుండగా, 99-00లో అయిదుకు, 00-01లో ఏడుకు, 01-02లో తొమ్మిదికి పెరిగాయి. ఈ రాష్ట్రాలు చాలా మెరుగు. ఎందుచేతనంటే 01-02లో మూడు రాష్ట్రాలు సంవత్సరానికి 365రోజులూ చేబదుళ్ళు తీసుకుంటూనే వచ్చాయి ఓవర్ డ్రాఫ్ట్ విషయంలోనూ ఇదే ధోరణి వ్యక్తమైంది. 98-99లో రెండు రాష్ట్రాలు 150 రోజుల కన్నా ఎక్కువ రోజులు ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకుంటే 1999-00లో నాలుగు, 00-01లో 10 రాష్ట్రాలు ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకున్నాయి. 01-02లో 300 రోజులపైనే తీసుకొన్న ఘనాపాటీ రాష్ట్రాలు రెండు వున్నాయి. అంటే కొన్ని రాష్ట్రాలు నిరంతరం ఆర్థిక దుస్థితిలో మునిగి వున్నాయన్నమాట. రాష్ట్రాలను దారిలో పెట్టాల్సిన కేంద్రమే ఈ ఊబిలో ఇరుక్కుపోయినపుడు, అదే బాటలో రాష్ట్రాలు పయనిస్తున్నాయి.

ఈ సమస్యను పరిశీలించిన రిజర్వు బాంకు కమిటీ 1999లో చేబదులు పరిమితిని పెంచిన నాటికి ముందు కాలంలోనే పరిస్థితి బావుందని, హద్దులను దాటిన సందర్భాలు పరిమితమని. పరిమితులను పెంచినప్పటి నుంచీ పరిస్థితి మరింత అధ్వాన్న మైందని భావించింది. అయితే కొన్ని రాష్ట్రాలు మాత్రం బుద్ధిగా మెసలుకొంటూ హద్దులు మీరలేదని పేర్కొన్నారు.

ఇలా చీటికి, మాటికి, కొన్ని రాష్ట్రాల్లో అయితే 365 రోజులూ చేబదుళ్లు తీసుకోవాల్సిన దుస్థితి ఎందుకు ఏర్పడింది? ఖర్చుకు తగ్గ ఆదాయం పెరగటం లేదు. దానితో రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల అప్పారావుల్లాగ తయారయ్యారు. అసలే ఆదాయం చాలటంలేదనుకుంటుంటే, ఈపరిమిత ఆదాయం నుంచి రుణం తిరిగి చెల్లింపులు, వడ్డీ చెల్లింపులు చేయాల్సి వచ్చి, రోజువారి ఖర్చులకూ, ఉద్యోగులకూ జీతాలివ్వడానికి, కూడా రిజర్వు బాంకు దగ్గరకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇది వరకు ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలను తెచ్చుకోని రాష్ట్రాలే ఎక్కువగా చేబదుళ్ళు, ఓవర్ డ్రాఫ్టలకు వెళ్లేవి. కాని ఇపుడు అలా అంతర్జాతీయ రుణాలు తెచ్చుకొన్న రాష్ట్రాల ఆ జాబితాలో మన రాష్ట్రం కూడా వుంది. రిజర్వు బ్యాంకుకు పరుగులు తీస్తున్నాయి.

రాష్ట్రాల బడ్జెట్లు ఆర్థిక పరిస్థితి ఎలా అధ్వాన్నమవుతూ వచ్చాయే రెండు రెళ్లు నాలుగు శీర్షికను చూడవచ్చు. దీని ప్రకారం 1997-98 రాష్ట్రాల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసం 1.6 వేల కోట్లు 2002-03 నాటికి (20.60) 48 వేల కోట్లను, అంటే మూడు రెట్లు పెరిగింది. ఆదేకాలంలో ఆదాయం కన్నా, ఖర్చు సుమారు 32 వేలకోట్లు పెరిగింది. వడ్డీభారం 90-91 నుంచి 01-02 మధ్యకాలంలో ఎనిమిదిరెట్లు పెరిగింది. రెవెన్యూ ఖర్చులో వడ్డీ చెల్లింపులు శాతం 9.52 నుంచి 19.46కు రెవెన్యూ ఆదాయంలో 13.02 నుంచి 23.81కు స్థూల జాతీయాదాయంలో 1.52 నుంచి 2.79 శాతానికి పెరిగిపోయాయి.

అలాగే స్థూల ద్రవ్యలోటు విషయంలో 17 పెద్ద రాష్ట్రాల్లో 1997-98లో మనరాష్ట్రం ఏడవ స్థానంలో వుండగా, 00-01లో ప్రకారం అయిదవ స్థానానికి వెళ్లింది. అంటే ద్రవ్యలోటు ఎక్కువగా పెరిగిందన్నమాట. 97-98లో ఈలోటు రు. 2428 కోట్లు కాగా కేవలం నాలుగు సంవత్సరాల్లో రు.7209 కోట్లకు రెవెన్యూ లోటు రు.703 కోట్లనుంచి రు.3113 కోట్లకు రెవెన్యూ ఆదాయం ఆరువేల కోట్లు పెరిగితే ఖర్చు ఎనిమిది వేలకోట్లు, మొత్తం ఖర్చు 11 వేల కోట్ల మేరకు పెరిగింది. ఇంత ఎక్కువగా పెరిగిన రాష్ట్రాల్లో మన రాష్ట్రం అయిదవ స్థానంలో వుంది. ఇలా బాధ్యతారహితంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాలను చేబదుళ్లతో, ఓవర్ డ్రాఫ్టులతో ఎన్నాళ్లు ఆదుకోవాలి? దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు, అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు, కేంద్రానికి పెద్ద గుమాస్తాగా పనిచేస్తున్న రిజర్వు బాంకు అంతా కలిసి, దేశాన్ని ఆర్థిక ఎమర్జన్సీవైపు నెట్టుతున్నాయి.

- (రిజర్వుబాంకు అధ్యయనం ఆధారంగా)

□